ప్రజాశక్తి
మంగళవారం 25 జులై 2023
8 పేజీలు



విశాఖపట్నం



అనకాపల్లి

ముంచెత్తిన వాన



- చెరువులను తలపించిన నగర రహదారులు
- లోతట్టు ప్రాంతాల్లో ప్రజల అవస్థలు
- ముందుకు తోసుకొచ్చిన సముద్రం
- ఒకే రోజు 33 మి.మీ వర్షం
- నేడు, రేపూ భారీ వర్షాలకు అవకాశం

విశాఖ నగరంలో రోడ్లపైకి చేరిన నీరు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

నగరాన్ని భారీ వర్షం సోమవారం ముంచెత్తింది. సాగరతీరంలో అలల తాకిడి పెరిగింది. సముద్రం కాస్త ముందుకొచ్చిందని వాతావరణ నిపుణులు చెబుతున్నారు. గడచిన కొద్దిరోజులుగా సాగర తీరంలో అలల తాకిడికి ఒడ్డుకు పెద్ద ఎత్తున ఇసుక దీంతో పాటు చెత్త, ఇతర వ్యర్థాలు కొట్టుకొచ్చేశాయి. తాజా వానలతో ఇంకా సముద్రంలో అలజడి పెరిగే అవకాశాలున్నాయి. ఫిషింగ్ హార్బర్, జాలారిపేట, రుషికొండ, ఎండాడ నుంచి వేటకు వెళ్లిన పలువురు మత్స్యకారులు సోమవారం మార్గమధ్యలోనే వెనక్కి వచ్చేశారు. సముద్రపోటు ఎక్కువగా ఉందన్నది తెలుస్తోంది. సోమవారం ఒక్కరోజు కురిసిన వర్షం 33మి.మీగా ఉందని వాతావరణ అధికారులు వెల్లడించారు. దీంతో ఎక్కడికక్కడే రహదారులు నిండిపోయి వాహన రాకపోకలకు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఒక రకంగా చాలారోజుల తర్వాత భారీ వాన ప్రజల్లో హర్షాతిరేకాలు నింపినా లోతట్టు ప్రాంత ప్రజానీకాన్ని వేదనకు గురిచేసింది. కెఆర్ఎం కాలనీ, మాధవధార, ముసలయ్యపాలెం, కొండవాలు ప్రాంత ప్రజానీకం తీవ్ర అసవ్థలకు గురికావడం నిత్యకృత్యంగా మారింది. చినుకు పడినా వారి జీవనానికి ఆటంకమే. అయినా ప్రభుత్వాలు ఎన్ని మారినా లోతట్టు ప్రాంత ప్రజలకు సరైన భరోసా ఉండడం లేదు. వర్షాకాలం కావడంతో మరింత ఆవేదనకు వీరు గురికావాల్సిన పరిస్థితులు నెలకొంటున్నాయి. ఇంట్లోకి వచ్చిన నీటిని ఇంటిల్లిపాదీ బిందెలు, బకెట్లతో బయటకు పారవేసే పనిలో కెఆర్ఎంకాలనీ, పాత పోస్టాఫీసు ఏరియా, మాధవధార, సీతమ్మధార, సీతమ్మపేటల్లో పలుచోట్ల దర్శనమిస్తున్నాయి. నగరం అంతటా నిర్మాణాలతో ఇరుకుగా మారిపోవడంతో నగర శివారు, లోతట్టు ప్రాంతాల్లో వాహనాలన్నీ మునకలో ఉండే పరిస్థితి కనిపిస్తోంది. జివిఎంసి పారిశుధ్య, పబ్లిక్ హెల్త్ విభాగాలే కాదు పట్టణ ప్రణాళిక విభాగం పనితీరు సైతం ఇలాంటి వర్షాల సందర్భంలో వెల్లడవుతోంది. అక్రమ పద్ధతుల్లో అనుమతులను ఇచ్చేయడంతో ఎక్కడికక్కడే సరైన పార్కింగ్ ప్రదేశాలకు ఆస్కారం లేక వర్షాల సమయాల్లో ప్రజానీకం అవస్థలకూ కారణంగా ఉంది.

ఇంకా వానలే వానలు...

బంగాళాఖాతంలో 24న ఏర్పడిన ఉపరితల ఆవర్తనం సముద్రమట్టానికి 3.1కి.మీ ఎత్తులో విస్తరించి ఈ నెల 26వ తేదీకి వాయుగుండంగా బలపడే అవకాశాలున్నాయి. ఉత్తర, దక్షిణ కోస్తా ఆంధ్రప్రదేశ్, యానాం సహా రాష్ట్రంలోని ఇంకా పలుచోట్ల వర్షాలు, అక్కడక్కడా భారీ వర్షాలు నమోదు కానున్నాయి. ఉరుములు, మెరుపులు కూడా భారీగా పడే అవకాశాలున్నాయని అమరావతి, విశాఖపట్నం వాతావరణ కేంద్రం అధికారులు సోమవారం రాత్రి వెల్లడించారు.

సగం మండలాల్లో లోటు

- వర్షాల్లేక ముందుకుసాగని సాగు
- ఏడు శాతమే పంట నమోదు
- ఊరటనిచ్చిన చినుకులు
- సిద్ధం చేస్తున్న నారు మడులు



తిమ్మరాజుపేటలో ఆకుపోస్తున్న రైతు

ప్రజాశక్తి-అనకాపల్లి ప్రతినిధి

జిల్లాలో ఖరీఫ్ సీజన్ నిరాశజనకంగానేవుంది. సగం మండలాల్లో వర్షపాతం లోటువుంది. దీంతో సాగు విస్తీర్ణంలో ఏడు శాతమే పంటలు నమోదయ్యాయి. సాగునీటి వనరులు సమృద్ధిగాలేకపోవడం, వర్షాలు లేమి కారణంగా పంటల సాగుపై ప్రభావం పడింది. జలాశయాల్లో వాటి సామర్థ్యానికి తగిన నీటి నిల్వలులేవు. ప్రణాళిక విభాగం అధికారిక వెబ్‌సైట్‌లో పొందుపర్చిన వర్షపాతం వివరాలను పరిశీలిస్తే ఈ ఏడాది జూన్ ఒకటి నుంచి జులై 24 వరకు జిల్లాలోని 24 మండలాలకుగానూ 12 మండలాల్లో వర్షపాతం లోటువుంది. ఈ వర్షపాతం లోటు ప్రభావం ఖరీఫ్ సాగు విస్తీర్ణంపై స్పష్టంగా కన్పిస్తోంది. జిల్లాలో వరి సాధారణ సాగు విస్తీర్ణం 1,36,460 ఎకరాలకు 1.06 లక్షల ఎకరాలకు (80 శాతం) సరిపడా రైతులు నారుమడులు సిద్ధంచేశారు. రెండ్రోజులుగా కురుస్తున్న వర్షాలకు ఆకుల పోతకు మడులు సిద్ధంచేస్తున్నారు. మునగపాక మండలంలో బోర్ల కింద తప్ప మిగిలిన చోట్ల ఆకులు పోయలేదు. వ్యవసాయ శాఖ అనకాపల్లి డివిజన్‌లో 75.4 శాతం, యలమంచిలి డివిజన్‌లో 46 శాతం, పాయకరావుపేట డివిజన్‌లో 66 శాతం ఆకులు పోశారు. వర్షాలు ఎక్కువగా నమోదైన చోడవరం డివిజన్‌లో 93.2, నర్సీపట్నం డివిజన్‌లో 96 శాతం ఆకులు పోశారు. ఎండిపోతున్న నారు మడులను ప్రస్తుత వర్షాలు నిలబెట్టాయి.

ఖరీఫ్‌లో సాధారణ సాగు విస్తీర్ణం

మిగతా 2లో..

మండలాల వారీగా జూన్ ఒకటి నుంచి జులై 24 వరకు వర్షపాతం లోటు మిల్లీమీటర్లలో

నాతవరం	21.3
సబ్బవరం	28.4
పరవాడ	47.4
అనకాపల్లి	57.8
మాకవరపాలెం	25.9
మునగపాక	37.3
అచ్యుతాపురం	33.8
యలమంచిలి	42.0
నక్కపల్లి	48.6
పాయకరావుపేట	40.1
ఎస్.రాయవరం	22.3
రాంబిల్లి	25.1

అదాని గంగవరం పోర్టు కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

▶ వార్త మెయిన్ 3లో..

2050కి 25 ఎంఎంటి హైడ్రోజన్ ఎనర్జీ

▶ వార్త మెయిన్3లో..

పూర్ణానంద స్వామికి పోక్సో కోర్టులో చుక్కెదురు

▶ వార్త మెయిన్‌లో..

నేడు కౌన్సిల్ సమావేశం

చర్చకు రానున్న అత్యధిక అజెండా అంశాలు

ప్రజాశక్తి - గ్రేటర్ విశాఖ బ్యూరో

మహా విశాఖ నగర పాలక సంస్థ (జివిఎంసి) కౌన్సిల్ సమావేశం మంగళవారం ఉదయం 10.30గంటలకు కార్పొరేషన్ సమావేశ మందిరంలో ప్రారంభం కానుంది. నగర మేయర్ గొలగాని హరి వెంకటకుమారి, జివిఎంసి కమిషనర్ సాయికాంత్ వర్మ, ఇతర ప్రధాన విభాగాల అధికారులు అందుకు సంబంధించిన అజెండాలను సిద్ధం చేసుకుని సమావేశ నిర్వహణకు సమాయత్తమవుతున్నారు. సుమారు 44 అజెండాలపైనా దీనికి అనుబంధంగా మరో 41 అంశాలను అనుబంధ అజెండాను రూపొందించారు. 2024 ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో అజెండాలో అభివృద్ధి పనుల పేరుతో రూ.కోట్లు ఆయా వార్డులు, అధికార ప్రజాప్రతినిధులు ఉన్న ఏరియాల వైపు మళ్లించే దిశగా పనులు చేపట్టే విధానం తీసుకున్నట్లు అజెండా చూస్తే స్పష్టమవుతోంది. ప్రధానమైన ప్రజా సమస్యలు ఈ సారైనా ప్రధాన పక్షాలు చర్చకు అంగీకరిస్తాయా? అంటే మంగళవారం జరిగే కౌన్సిల్ చూడాల్సిందే. తెలుగుదేశం, సిపిఎం, సిపిఐ, జనసేన, బిజెపి కార్పొరేటర్లు పలు అంశాలను ఆయా వార్డుల్లోనూ, నగర పరిధికి సంబంధించిన ప్రజా సమస్యలపై నిరంతరం జివిఎంసి అధికారుల స్పందన నానాటికీ తీసికట్టుగా ఉంటోంది. నగరంలోని అనేక వార్డుల్లో జివిఎంసి భూములు, గెడ్డలు, చెరువుల ఆక్రమణతో పర్యావరణ సమస్యలు తలెత్తుతున్నా పాలకులకు పట్టడం లేదు.

ప్రజా సమస్యలు చర్చకు వచ్చేనా?

నగరంలోని ఎంవిపి కాలనీలోగల మల్టీ ఇండోర్ స్పోర్ట్స్ కాంప్లెక్స్‌ను డబ్బులు చెల్లిస్తే గానీ లోపలకు అడుగుపెట్టని పరిస్థితిని సృష్టించారు. ప్రభుత్వ సంస్థ జివిఎంసి నిర్మాణం చేసి ప్రైవేట్ వారికి దారాదత్తం చేయడంపై సిపిఎం 78వ వార్డు కార్పొరేటర్ ఇదివరకే జివిఎంసి కమిషనర్ దృష్టికి తీసుకొచ్చారు. భీమిలి మండలం నారాయణరాజుపేటలో అధికార వైసిపి నేతలు భూ కుంభకోణాలకు పాల్పడిన వైనంపై కార్పొరేటర్ డాక్టర్ బి.గంగారావు అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. వీటిపై చర్చ జరుగుతుందా? అంటే అనుమానమే? అలాగే గంగవరం పోర్టు యాజమాన్యం అనుసరిస్తున్న వైఖరితో కార్మికులకు కనీస వేతన చట్టం అమలు కానివైనంపైనా సిపిఎం పోరాడుతోంది. నగర పరిధిలో గల ప్రైవేట్ పోర్టు అదానీ చేతికి వెళ్లాక ఆగడాలు మరింత పెరగడంతో గంగవరం ప్రాంతంలో ప్రజలు, కార్మికుల

మిగతా 2లో..

1న సిఎంచే ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన

ప్రజాశక్తి -ఎంవిపి.కాలనీ : నగర ప్రజల జీవన విధానానికి తగ్గట్టు ఉపయోగపడే ఇనార్బిట్ మాల్‌ను ఆగస్టు 1వ తేదీన ముఖ్యమంత్రి జగన్మోహన్‌రెడ్డి శంకుస్థాపన జివిఎంసి కమిషనర్ సి ఎం. సాయికాంత్ వర్మ తెలిపారు. 45వ వార్డు పరిధిలోని కైలాసపురం రోడ్డులో ఏర్పాటు చేయనున్న ఇనార్బిట్ మాల్ శంకుస్థాపన, పార్కింగ్, స్టేజి, రెస్ట్ రూమ్ తదితర ఏర్పాట్లపై అధికారులతో సమీక్షించి పలు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ పర్యటనలో అదనపు కమిషనర్లు డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ వి.సన్యాసిరావు, పట్టణ ప్రణాళిక అధికారి సునీత, ప్రధాన ఇంజినీరు రవి కృష్ణంరాజు, పర్యవేక్షక ఇంజనీర్ వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

మొదటి పేజీ తరువాయి..

సగం మండలాల్లో లోటు

2,04,980 ఎకరాలకు సోమవారం (జులై 24)నాటికి 14,932 ఎకరాల్లో పంటల సాగు నమోదైంది. 2021 జులై 24 నాటికి 29,285 ఎకరాల్లో పంటలు సాగుకాగా, 2022 జులై 24 నాటికి 32,242 ఎకరాల్లో నమోదైంది. ఈ ఏడాది గతేడాదితో పోల్చిచూస్తే వర్షాల్లేకపోవడంతో సగం సాగు నమోదుకాలేదు. వరి సాధారణ సాగు విస్తీర్ణం 1.36 లక్షల ఎకరాలకు 127 ఎకరాల్లో పంట నమోదైంది. గతేడాది ఇదే కాలానికి 177 ఎకరాల్లో వరి పంట వేశారు. చెరకు సాగు గణనీయంగా తగ్గింది. చెరకు సాధారణ సాగు విస్తీర్ణం 60వేల ఎకరాలకుగానూ 13,300 ఎకరాలకు పడిపోయింది. 2021లో 24,547 ఎకరాలు, 2022లో 27,987 ఎకరాలున్న చెరకు సాగు, 2023 జులై 24 నాటికి 13,300 ఎకరాలకు తగ్గింది. చీడికాడ మండలంలో సాధారణం కంటే 62.5 మిల్లీమీటర్ల వర్షపాతం ఎక్కువ నమోదైంది. దేవరాపల్లి మండలంలో 31.6 మిల్లీమీటర్ల వర్షపాతం కురిసింది. అనకాపల్లి మండలంలో 57.8 మిల్లీమీటర్ల వర్షపాతం లోటువుంది. ఇప్పటికైనా వర్షాలు సకాలంలో పడితే వరి పంట పూర్తిస్థాయిలో సాగవుతుందని వ్యవసాయశాఖాధికారులు చెబుతున్నారు.

నేడు కౌన్సిల్ సమావేశం

మనుగడ ప్రశ్నార్థకంగా మారింది. ప్రధాన పక్షాలు ముఖ్యంగా అధికార వైసిపికి ఇదేమీ పట్టడం లేదు. స్థాయీసంఘంలోనూ తాము అనుకున్న పనులకు ఆమోదముద్ర వేసుకోవడం, కౌన్సిల్‌లోనూ మంది బలంతో రూ.వందలకోట్ల పనులను తమకు అనుకూలంగా దక్కించుకునే దిశగానే అజెండాలను పొందుపరచుకోవడం కొట్టొచ్చినట్లు కనిపిస్తోంది. నగర పరిధిలో డివైడర్ల వద్ద జరుగుతోన్న (జివిఎంసి చేపడుతున్న) పనుల్లోనూ అక్రమాలు చోటుచేసుకుంటున్నాయి. కొత్తగా కాంట్రాక్టర్ల జేబులు నింపడానికే డివైడర్ల వద్ద పాత రాళ్లు ఉంటుండగానే కొత్త రాళ్లను వాటిపక్కనే అమర్చేస్తున్నారు. హనుమంతవాక నుంచి కైలాసగిరి వరకూ గల రహదారి పనుల్లో పెద్ద సమస్య ప్రస్తుతం లేకపోయినా గుత్తేదార్ల ప్రయోజనాల కోసం మరలా మాస్టర్ ప్లాన్ రహదారి కోసం రూ.12కోట్లకు పైగా వ్యయం చేసేందుకు కౌన్సిల్‌లో ఆమోదం కోసం ఓ అధికార పార్టీ కార్పొరేటర్ పావులు కదిపారు.

నేటి నుంచి రాయితీపై టమోటా

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : విశాఖపట్నం జిల్లాలో గల అన్ని రైతు బజార్లలో మంగళవారం నుంచి కిలో టమోటా రూ.50కి విక్రయించనున్నట్లు విశాఖ జాయింట్ కలెక్టర్ విశ్వనాథన్ ఒక ప్రకటనలో తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం, వ్యవసాయ మార్కెటింగు శాఖ ద్వారా పుంగనూరు నుండి 25 టన్నుల టమోటో తెచ్చినట్లు పేర్కొన్నారు. సెలవు ఉన్న రైతు బజార్లు అనగా గోపాలపట్నం, కంచరపాలెం, సీతమ్మధార, పెదవాల్తేర్, పెదగంట్యాడ, ములగాడ రైతు బజార్లలో కూడా టమోటా అమ్మకాలు జరుపనున్నట్లు వివరించారు. మనిషికి కిలో టమోటా మాత్రమే ఇస్తారని, ఆధార్ లేదా రేషన్ కార్డు కాపీని చూపించాలని పేర్కొన్నారు.

వేడి నీటితో కడగాలి

టమోటాలు తీసుకున్న వినియోగదారులు వాటిని వేడినీటితో శుభ్రం చేసుకోవడం మంచిదని జ్ఞానాపురం షాప్ నెంబర్ 59, 60 న్యూ వెజిటబుల్ హోల్‌సేల్ మార్కెట్ యజమాని కెజిబి ప్రసాద్ తెలిపారు.



పిఎఫ్ బకాయిలు చెల్లించాలని 'చిట్టివలస' కార్మికుల నిరసన

ప్రజాశక్తి- కలెక్టరేట్ (విశాఖ): పిఎఫ్, పెన్షన్ బకాయిలు చెల్లించాలని డిమాండ్ చేస్తూ సోమవారం కలెక్టరేట్ ఆవరణలో చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులు నిరసన తెలిపారు. ఈ సందర్భంగా యూనియన్ నాయకుడు దల్లి అప్పలరెడ్డి మాట్లాడుతూ, చిట్టివలస జ్యూట్ మిల్లు యాజమాన్యం 2009 ఏప్రిల్ 20న లాకౌట్ విధించి, తర్వాత శాశ్వతంగా మూసి వేసిందన్నారు. అప్పట్నుంచి కార్మికులకు పిఎఫ్ సొమ్ము అంచెలంచెలుగా చెల్లిస్తున్నారని తెలిపారు. జ్యూట్ మిల్లులో సుమారు 400 మంది కార్మికులు (నేమ్ చేంజింగ్) మారు పేర్లుతో పనిచేశారని, వారి పిఎఫ్ సొమ్ము పిఎఫ్ ట్రస్ట్ బోర్డులో ఉందని వివరించారు. వారికి పిఎఫ్ డబ్బులు, పెన్షన్ రూ.వెయ్యి యాజమాన్యం చెల్లించలేదన్నారు. వారందరికీ పిఎఫ్, పెన్షన్ చెల్లించాలని డిమాండ్ చేశారు. అనంతరం జిల్లా కలెక్టర్‌కు స్పందనలో వినతిపత్రం సమర్పించారు.



కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలుపుతున్న చిట్టివలస జ్యూట్ మిల్లు కార్మికులు

హైదరాబాద్-కటక్-హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైళ్లు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : అదనపు రద్దీని క్లియర్ చేయడానికి హైదరాబాద్-కటక్-హైదరాబాద్ మధ్య ప్రత్యేక రైలు సేవలను పొడిగించాలని రైల్వే శాఖ నిర్ణయించింది. 07165 హైదరాబాద్-కటక్ ప్రత్యేక రైలు ఆగస్టు 1 నుండి సెప్టెంబర్ 26 వరకు ప్రతి మంగళవారమూ రాత్రి 20.10 గంటలకు హైదరాబాద్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 9.05 గంటలకు దువ్వాడ, సాయంత్రం 17.45 గంటలకు కటక్ చేరుకుంటుంది. 07166 కటక్-హైదరాబాద్ ప్రత్యేక రైలు ఆగస్టు 2వ తేదీ నుండి సెప్టెంబర్ 27వ తేదీ వరకు ప్రతి బుధవారమూ రాత్రి 22:30 గంటలకు కటక్‌లో బయలుదేరి మరుసటి రోజు ఉదయం 7.35 గంటలకు దువ్వాడ, రాత్రి 21.00 గంటలకు హైదరాబాద్ చేరుకుంటుంది. ఈ రైళ్లు సికింద్రాబాద్, నల్గొండ, మిర్యాలగూడ, సత్తెనపల్లి, గుంటూరు, విజయవాడ, ఏలూరు, రాజమండ్రి, సామర్లకోట, అన్నవరం, అనకాపల్లి, దువ్వాడ, కొత్తవలస, విజయనగరం, శ్రీకాకుళం రోడ్డు, పలాస, బ్రహ్మపూర్, ఖుర్దారోడ్డు, భువనేశ్వరాక్ మీదుగా ప్రయాణిస్తాయి.

రిస్క్ మేనేజ్‌మెంట్‌పై శిక్షణ

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర యూనివర్సిటీ క్యాంపస్‌లోని ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ మేనేజ్‌మెంట్‌లో ఐఎన్ఎఎస్ అధికారుల కోసం రిస్క్ మేనేజ్‌మెంట్‌పై ఆరు రోజుల శిక్షణను, డిఆర్‌డిఒ శాస్త్రవేత్తల ఐదు రోజుల సామర్థ్య నిర్మాణ కార్యక్రమాలను సోమవారం ప్రారంభించారు. డిఆర్‌డిఒ మాజీ డైరెక్టర్ జనరల్ (హెచ్ఆర్) కెఎస్.వరప్రసాద్ ప్రారంభోపన్యాసం చేశారు. సంస్థలో ఎదుగుతున్న కొద్దీ నిర్వాహక నైపుణ్యాలను పెంపొందించుకోవాల్సిన ప్రాముఖ్యతను తెలిపారు. ప్రాజెక్ట్‌లను విజయవంతంగా పూర్తి చేయాలని, మానవ వనరులను ఉపయోగించాలని సూచించారు.

జనతా బజార్‌ను ఖాళీ చేయించొద్దు

ప్రజాశక్తి-కలెక్టరేట్ (విశాఖ) : జివిఎంసి 35వ వార్డులో ఉన్న జనతా బజార్ శిథిలావస్థలో ఉన్నందున, దానిని తొలగించి కొత్త దుకాణాలను నిర్మిస్తామని చెప్పి ఖాళీ చేయాలని జివిఎంసి అధికారులు కోరడం సరికాదని కార్పొరేటర్ విల్లూరి భాస్కరరావు పేర్కొన్నారు. ఈ మేరకు సోమవారం స్పందనలో జివిఎంసి కమిషనర్‌కు వినతి పత్రం అందించారు. మున్సిపల్ స్టేడియం చుట్టూ కొత్తగా షాపింగ్ కాంప్లెక్స్ నిర్మించి, వాటిలోకి జనతా బజార్ దుకాణాల వారిని తరలించాలని, అంతవరకు జనతా బజార్ దుకాణాలను ఖాళీ చేయించవద్దని కోరారు. దీనికి కమిషనర్ అంగీకరించారు. దీంతో జనతా బజార్ వ్యాపారులు కార్పొరేటర్ భాస్కరరావుకు కృతజ్ఞతలు తెలిపారు.

ప్రధాన రోడ్డు విస్తరణ జరిగేనా?

- ఏళ్లతరబడి కార్య రూపం దాల్చని ప్రతిపాదనలు
- ఇరుకు రోడ్డులో తరచూ ట్రాఫిక్‌కు ఇక్కట్లు
- అనునిత్యం ప్రజలు, వాహనదారుల అవస్థలు
- పట్టించుకోని అధికారులు, నేతలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : భీమిలి ప్రధాన రహదారి విస్తరణ ప్రతిపాదనలు నేటికీ కార్యరూపం దాల్చ లేదు. పట్టణంలో పెరుగుతున్న ప్రజలు, వాహనదారుల అవసరాలను దృష్ట్యా ప్రస్తుతం తహసీల్దార్ కార్యాలయం నుంచి స్థానిక గంట స్తంభం వరకు సుమారు 20 నుంచి 25 అడుగుల ఉన్న రోడ్డును కనీసం 66 అడుగుల మేర విస్తరణ చేయాలని 2015లోనే అప్పటి ప్రభుత్వానికి అధికారులు ప్రతిపాదనలు పంపారు. అలానే గంట స్తంభం నుంచి పోలీస్ స్టేషన్ వరకు ఇప్పుడున్న సుమారు 30 నుంచి 40 అడుగుల మేర ఉన్న రోడ్డును కూడా 66 అడుగుల మేర విస్తరణ చేయాలని కూడా అప్పట్లోనే ప్రతిపాదనలు పంపారు. అయితే నేటికీ కార్యరూపం దాల్చలేదు. దీనికి నిధుల లేమియా? లేకుంటే ఇంకేమైనా రాజకీయపరమైన ఒత్తిళ్ల, ఇతరత్రా కారణాలు ఏమైనా ఉన్నాయా? లేక అధికారులు, నేతల్లో చిత్తశుద్ధి కొరవడిందా అన్నది అప్రస్తుతం. అయినప్పటికీ ప్రజలు అవసరాలు, ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుంటే రోడ్డు విస్తరణ అనేది తక్షణ అవసరమని చెప్పకతప్పదు.

తరచూ ట్రాఫిక్ సమస్య..

తహశీల్దార్ కార్యాలయం నుంచి ప్రభుత్వ ఆసుపత్రి మీదుగా గంటస్తంభం వరకు వచ్చే ఆర్‌టిసి బస్సులు, ఇతరభారీ వాహనాలు ఒక వైపుగా వస్తే, ఎదురుగా ఇంకో బస్సు, ఇతర వాహనాలు, కనీసం మోటారు బైక్‌లు కూడా తప్పించుకుని వెళ్లలేని పరిస్థితి ఇక్కడ ఉంది. ట్రాఫిక్ క్లియర్ చేసేందుకు పోలీసులు నానా అవస్థలు పడుతున్న సందర్భాలు అనేకం. ఇప్పటికైనా ప్రధాన రహదారి విస్తరణ చేపట్టాలని స్థానికులు కోరుతున్నారు



విస్తరణ చేయాల్సిన భీమిలి మెయిన్ రోడ్డు ఇదే

ప్రజావసరాలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి



స్థానిక ప్రజల అవసరాలు, ఆకాంక్షలకు తొలి ప్రాధాన్యం ఇవ్వాలి. అందుకు అనుగుణంగా ప్రధాన రోడ్డు విస్తరణ చేపట్టాలి. మెజారిటీ ప్రజలు కోరికను తీర్చాల్సిన బాధ్యత అధికారులు, ప్రభుత్వంపై ఉంది.

కంచర్ల కామేష్, భీమిలి

రోడ్డు విస్తరణతో ట్రాఫిక్ సమస్యకు చెక్



ప్రధాన రోడ్డు విస్తరణతోనే ట్రాఫిక్ సమస్య తీరుతుంది. ఈ మార్గంలో ఎదురెదురుగా బస్సులు, వాహనాలు వస్తే మళ్లిపోవడానికి వీలులేని పరిస్థితి ఉంది. బస్సు, బైక్‌లు ఎదురెదురుగా వచ్చినా, దాటి వెళ్లాలన్నా ఇబ్బందికరమే.

పాసి మధుసూధనరావు, భీమిలి

ప్రభుత్వం స్పందించాలి



ప్రభుత్వం, జివిఎంసి అధికారులు స్పందించి రోడ్డు విస్తరణ చేపట్టాలి. రోడ్డు ఇరుకుగా ఉండడంతో అనునిత్యం చాలా సమస్యలు తలెత్తుతున్నాయి. ఒక్కోసారి రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి.

మారోజు సంజీవ్‌కుమార్, భీమిలి

ప్రభుత్వ భూమి ఆక్రమణపై ఫిర్యాదు

ప్రజాశక్తి- పద్మనాభం: మండలంలోని అనంతవరం గ్రామంలో సర్వే నెంబరు 256లో రెండు ఎకరాల ప్రభుత్వ భూమిని గ్రామసర్పంచ్ జి.లక్ష్మి భర్త జి.పెద్దఎర్రినాయుడు ఆక్రమించారని గ్రామానికి చెందిన కొంతమంది రైతులు సోమవారం స్పందనలో కలెక్టరుకు ఫిర్యాదు చేశారు. ప్రభుత్వ భూమిని తన ఆధీనంలో ఉన్న బినామీల పేర్లు పెట్టి, సొంతం చేసుకుని మొక్కలు వేశారని ఫిర్యాదులో పేర్కొన్నారు. జగనన్న అర్బన్ కాలనీని ఆనుకుని కోట్ల విలువైన భూమిని అధికారం అడ్డం పెట్టుకొని దురాక్రమణ చేశారని,ఈ భూమిని స్వాధీనం చేసుకొని నిరుపేదలకు పంపిణీ చేయాలని రైతులు సిహెచ్ సూర్యనారాయణ, జి చంద్రరావు, కె.అప్పారావు, ఎల్ సత్యం, .జి ఎర్రిబాబు, ఎల్ ముసలినాయుడు, ఎస్‌కె రెహమాన్. ఫిర్యాదులో కోరారు.

అనంతవరం సర్పంచ్ భర్త వివరణ

ప్రభుత్వ భూమిని ఆక్రమించారని స్పందనలో రైతులు ఇచ్చిన ఫిర్యాదుపై అనంతవరం సర్పంచ్ లక్ష్మి భర్త పెద్ద ఎర్రినాయుడు ఒక ప్రకటనలో వివరణ ఇచ్చారు. 20ఏళ్లుగా తన సాగులో ఉన్న భూమిలోని మామిడి చెట్లను తొలగించి, జగనన్న అర్బన్ కాలనీకి ప్రభుత్వం తీసుకుందని, అవసరం లేదని నత భూమిని తిరిగి అప్పగించిందన్నారు. దీనికి సంబంధించి సాగు అనుభవం పత్రాలు తన వద్ద ఉన్నాయన్నారు.

జివిఎంసిలో అవినీతిపై విచారణ చేయాలి : జనసేన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : జివిఎంసి పరిధిలో జరుగుతున్న పలు అవినీతి అక్రమాలపై విచారణ జరపాలని కోరుతూ 22వ వార్డు జనసేన కార్పొరేటర్ పీతల మూర్తియాదవ్ సోమవారం జివిఎంసి జగన్నన్నకు చెబుదాం కార్యక్రమంలో వినతిపత్రం అందించారు. పెదవాల్తేరు జాలారిపేటలో నిర్మించిన ఆదర్శ గృహాల కేటాయింపులో పెద్ద ఎత్తున అక్రమాలు జరిగాయని, అర్హులకు కాకుండా పైరవీకారులకు మంజూరు చేశారని పేర్కొన్నారు. నగరపాలక సంస్థ యుసిడిలో పనిచేసే సమన్వయకర్తలు పోస్టుల కోసం పలువురు ఆర్‌పిల నుంచి కొందరు అధికారులు రూ.5 లక్షల లంచానికి బేరమాడి రూ.3 లక్షలు చొప్పున ఒక అడిషనల్ కమిషనర్, యుసిడి అధికారులు వసూలు చేశారని వినతిలో పేర్కొన్నారు. సెంటర్ పార్క్ ఫుడ్ కోర్ట్ ఏర్పాటుకు 26 మందికే యుసిడి అనుమతులు మంజూరు చేసిందని, కానీ అక్కడ దాదాపు 160 మంది వ్యాపారం చేస్తున్నారని తెలిపారు. అనుమతులు లేని వారి నుంచి డిప్యూటీ మేయర్ నేతృత్వంలోని కమిటీ లంచాలు వసూలు చేస్తున్నట్లు ఆరోపణలు ఉన్నాయని తెలిపారు. దీనిపై విచారణ జరపాలని కోరారు.

బ్రహ్మాస్త్రంతో పైర్లపై చీడపీడల నివారణ

ప్రజాశక్తి-ఆనందపురం: పంటలను ఆశించే చీడపీడలు, గొంగళి పురుగులు నివారణకు ఐదు రకాల ఆకులతో బ్రహ్మాస్త్రం తయారీపై రైతులకు వివరించారు. సోమవారం మండలంలోని తర్లువాడ గ్రామంలో ప్రకృతి వ్యవసాయ రైతులకు కషాయాల తయారీపై సంబంధిత కార్యకర్త రామారావు శిక్షణనిచ్చారు. బ్రహ్మాస్త్రం తయారీని రైతులకు వివరించి, ప్రయోగాత్మకంగా చేసి చూపించారు. వేపాకు 3 కేజీలు, జిల్లేడు ఆకులు 2 కేజీలు, ఆముదం ఆకులు 2 కేజీలు, కోమాకులు 2 కేజీలు, సీతాఫలం ఆకులు 2 కేజీలు ఐదు రకాల ఆకులు తీసుకొని మెత్తగా దంచి, 10 లీటర్ల ఆవు మూత్రంలో వేసి 3 లేదా 4 పొంగులు వచ్చేంత వరకు మరిగించి, చల్లార్చిన తర్వాత ఒక పలుచని గుడ్డతో వడగట్టుకొని 48గంటల పాటు ఉంచాలన్నారు. రెండున్న కిలోల బ్రహ్మాస్త్రం ద్రావణాన్ని, వంద లీటర్ల నీటిలో కలిపి, దాన్ని ఎకరానికి పిచికారీ చేస్తే గొంగళి పురుగులు, చీడపీడలను నివారించవచ్చని ప్రకృతి వ్యవసాయ విధానం కార్యకర్త రామారావు సూచించారు.కార్యక్రమంలో నేచురల్ ఫార్మింగ్ అసోసియేట్ అనురాధ, ఇంటర్నల్ క్లస్టర్ రిసోర్స్ పర్సన్ పైడిరాజు, నాగమణి పాల్గొన్నారు

నేరాలు ఘోరాలు

గుర్తుతెలియని మహిళ దుర్మరణం



మృతురాలు

ప్రజాశక్తి -గాజువాక. :రోడ్డు ప్రమాదంలో గుర్తుతెలియని మహిళ దుర్మరణం చెందిన ఘటన సోమవారం పంతులుగారి మేడ సమీపంలో చోటుచేసుకుంది. సోమవారం మూడు గంటలకు పంతులుగారి మేడ వద్ద రోడ్డు దాటుతుండగా అరవై ఏళ్ల మహిళను గుర్తు తెలియని వాహనం వాహనం ఢీకొని పరారైంది ప్రమాదస్థలిలోనే నేలమీద పడి మహిళ మృతి చెందిన విషయాన్ని స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. మృతి చెందిన మహిళ ఆకుపచ్చ చీర, నీలిరంగు జాకెట్ ధరించి ఉందన్నారు. సమాచారం తెలిసిన వారు తెలియజేయాలని పోలీసులు కోరారు. పరారయింది. ఈమె నేల మీద పడి దుర్మరణం చెందింది.

'కోరమండల్'లో వ్యక్తి ఆత్మహత్య

ప్రజాశక్తి -ములగాడ : కోరమండల్ ఫెర్టిలైజర్స్ కంపెనీ బాత్రూంలో ఓ వ్యక్తి ఆత్మహత్య పాల్పడిన ఘటన సోమవారం వెలుగులోకి వచ్చింది. మధ్యప్రదేశ్ సిద్దిజిల్లా, ఖడ్డిఖుర్ద్ ప్రాంతానికి చెందిన శివకుమార్ సాహు (22) లాస్యశ్రీ లాజిస్టిక్స్‌లో లారీడ్రైవర్‌గా పనిచేస్తున్నాడు. జ్ఞానాపురంలో అద్దింట్లో నివాసముంటున్న శివకుమార్ ఆదివారం డ్యూటీకి వచ్చాడు. సంస్థ గేట్ నెంబర్ 10 వద్ద ఉన్న బాత్రూంలో హుక్‌కు ఉరేసుకుని మృతి చెందాడు. సోమవారం అదే బాత్రూమ్‌కు వేరే లారీడ్రైవర్ బాత్ రూమ్‌కు వెళ్ళినప్పుడు, శివకుమార్ ఉరేసుకుని ఉండడాన్ని గమనించాడు. వెంటనే సంస్థ అధికారులు ఘటన స్థలానికి వెళ్లి మృతదేహాన్ని పరిశీలించి, మల్కాపురం పోలీసులకు సమాచారం అందజేశారు సమాచారం అందుకున్న మల్కాపురం పోలీసులు ఘటన స్థలానికి వెళ్లి వివరాలను సేకరించారు కేసును మల్కాపురం సిఐ జిడి బాబు ఆధ్వర్యంలో ఎస్ఐ దేవుడమ్మ దర్యాప్తు చేస్తున్నారు,


వేర్వేరు ఘటనల్లో ఇద్దరు ఆత్మహత్య

ప్రజాశక్తి-యస్.రాయవరం: మండలంలో వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి చెందారు. వివరాల్లోకి వెళ్తే కొత్త పోలవరం గ్రామానికి చెందిన బత్తిన సత్యవతి సోమవారం ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. మూడు నెలల క్రితం మృతురాలి కుమార్తె దుర్గ కుటుంబ సమస్యలతో చనిపోవడంతో అప్పటి నుండి మనోవేదనకు గురైంది. తన ఇంట్లో సీలింగ్ ఫ్యాన్‌కు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకుందని పోలీసులు తెలిపారు.

మరొక ఘటనలో గుడివాడ పంచాయతీ లక్ష్మీపతిరాజు పేట గ్రామానికి చెందిన ఒమ్మి బాలరాజు చెట్టుకి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. మృతుని తల్లి తెలిపిన వివరాలు ప్రకారం.. మృతుడు అవంతి హేచరీలో పని చేస్తున్నాడని, ఆదివారం తన 10వ తరగతి విద్యార్థులతో గెట్ టు గెదర్ కార్యక్రమంలో పాల్గొని ఇంటికి వచ్చాడని తెలిపింది .తన కుమారుడు స్నేహితుడు ఇంటివద్ద పడుకుంటానని వెళ్లాడని, సోమవారం ఉదయం ఫోన్ చేయగా ఫోన్ లిఫ్ట్ చేయకపోవడంతో వెతికామన్నారు. ఇంటి పక్కన మామిడి తోటలో చెట్టుకు ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడని వాపోయింది. పోలీసులు పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని నక్కపల్లి ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

గ్రంథాలయ పితామహుడు 'అయ్యంకి'కి ఘననివాళి

ప్రజాశక్తి-పెందుర్తి : స్థానిక శాఖా గ్రంథాలయంలో ఆంధ్రప్రదేశ్ గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతిని ఘనంగా నిర్వహించారు. అయ్యంకి చిత్రపటానికి గ్రంథాలయ అభివద్ధి కమిటీ సభ్యులు భూలోకరావు పూలమాలలు వేసి నమస్కరించారు. ఈ సందర్భంగా గ్రంథాలయ అధికారిణి బి సూర్యకళ మాట్లాడుతూ గాంధీజీతో స్వాతంత్ర సమరంలో పాల్గొన్న అయ్యంకి వెంకట రమణయ్య, రాష్ట్రంలో గ్రంథాలయాల అభివృద్ధికి విశేషకృషి చేశారన్నారు. వాడవాడలా తన సొంత డబ్బులతో వందల సంఖ్యలో గ్రంథాలయాల స్థాపనకు ప్రోత్సాహించి, .తెలుగు నాట గ్రంథాలయ ఉద్యమానికి బాసటగా నిలిచి, రాష్ట్ర గ్రంథాలయ పితామహులయ్యారన్నారు. వయోజన విద్యను ప్రోత్సహించారని తెలిపారు.



పెందుర్తిలో అయ్యంకి చిత్రపటానికి నివాళులు

కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ సెక్రెటరీ ఆడారి రామకృష్ణ, సభ్యులు పెంటకోట గణేష్, పలువురు పాఠకులు పాల్గొన్నారు.

ములగాడ : గ్రంథాలయ ఉద్యమకారుడు అయ్యంకి వెంకట రమణయ్య చిరస్మరణీయుడని, దేశ స్వతంత్రానికి, గ్రంథాలయ ఉద్యమానికి ఆయన చేసిన సేవలు నిలుపుమానమని ప్రముఖ న్యాయవాది జికెవి.రాజు అన్నారు. ప్రకాష్‌నగర్ శాఖా గ్రంథాలయంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి ఉత్సవాలను ప్రారంభిస్తూ, ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళు లర్పించారు. సమావేశంలో ప్రముఖ రచయిత కె.సత్తిరాజు, కార్మిక నాయకులు బి. సత్యానందం, జాతీయ సేవా పథకం జిల్లా ప్రోగ్రామ్ అధికారి ఇ.పి.ఎస్. సీనియర్ ప్రోగ్రామ్ అధికారి వై. అనసూయదేవి, గ్రంథాలయ అధికారి వి. అజయ్ కుమార్ పాల్గొన్నారు.

సింహాచలం: గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకటరమణయ్య 133వ జయంతిని అడవివరం గ్రంథాలయఅధికారి రాజు ఆధ్వర్యంలో నిర్వహించారు. అయ్యంకి వెంకటరమణయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి జ్యోతి ప్రజ్వలన చేసి నివాళులర్పించారు.

ఎయులో నేడు శ్రావణి నృత్య ప్రదర్శన

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : ఆంధ్ర విశ్వవిద్యాలయం కామర్స్ మేనేజ్‌మెంట్ విభాగం సమావేశ మందిరంలో మంగళవారం ప్రవాస భారతీయురాలు చల్లపల్లి శ్రావణి నృత్య ప్రదర్శన ఏర్పాటు చేస్తున్నట్లు ఆర్ట్స్ కామర్స్ కళాశాల ప్రిన్సిపల్ ఆచార్య నరసింహారావు తెలిపారు. సోమవారం కార్యక్రమ వివరాలను వెల్లడించారు. అమెరికాలో స్థిరపడిన చల్లపల్లి శ్రావణి చిన్నతనం నుంచి కళలపై ఆసక్తితో కూచిపూడి నృత్యాన్ని అభ్యసించారన్నారు. మంగళవారం ఉదయం రెండు గంటల పాటు శ్రావణి నృత్య ప్రదర్శన ఉంటుందన్నారు.

చల్లపల్లి శ్రావణి మాట్లాడుతూ, తాను హైదరాబాదులో ఓనమాలు నేర్చుకున్నానని, తర్వాత అమెరికాలో కూడా దీనిని కొనసాగించినట్లు చెప్పారు. ఏయూలో నృత్య ప్రదర్శన ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని చెప్పారు. మంగళవారం ఉదయం 11 గంటల నుంచి గణేశ పంచరత్నం, కామాక్షి స్తుతి, బ్రహ్మ కడిగిన పాదం, శివతాండవ స్తోత్రం, జావలి ప్రదర్శిస్తానని తెలియజేశారు. కార్యక్రమంలో ఆచార్య చల్లా రామకృష్ణ, ఆచార్య సిఎస్.రావు, విజయవేణి, రాజశ్రీ తదితరులు పాల్గొన్నారు.

జగనన్నకు చెబుదాంకు భారీగా అర్జీలు

ప్రజాశక్తి-ఎంవిపి కాలనీ : జివిఎంసి ప్రధాన కార్యాలయంలో సోమవారం నిర్వహించిన 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమానికి 108 అర్జీలు వచ్చాయని మేయర్ గొలగాని హరి వెంకటకుమారి తెలిపారు. "డయల్ యువర్ మేయర్"కు 14 అర్జీలు వచ్చాయని పేర్కొన్నారు.

కలెక్టరేట్‌కు 335 వినతులు

కలెక్టరేట్‌లో నిర్వహించిన జగనన్నకు చెబుదాం (స్పందన) కార్యక్రమానికి 335 వినతులు వచ్చినట్లు జాయింట్ కలెక్టర్ కెఎస్.విశ్వనాథన్ తెలిపారు. వినతులను నిర్ణీత కాల పరిమితిలోగా పరిష్కరించాలని అధికారులను ఆదేశించారు.

సిపి స్పందనకు 50 వినతులు

నగర పోలీస్ కాన్ఫరెన్స్ హాల్లో డిసిపి (క్రైమ్) జి.నాగన్న, ఎడిసిపి (అడ్మిన్) ఎంఆర్‌కె.రాజు, ఎడిసిపి (ఎస్బి) నాగేంద్రుడు, లీగల్ అడ్వైజర్ పివి.రామకృష్ణ నిర్వహించిన స్పందన కార్యక్రమానికి 50 మంది ఫిర్యాదుదారులు వచ్చి తమ సమస్యలను రిపోర్టుల ద్వారా డిసిపికి అందజేశారు.

స్పందనకు రెండు అర్జీలు

ప్రజాశక్తి -భీమునిపట్నం : జివిఎంసి ఒకటో జోన్ కార్యాలయంలో సోమవారం నిర్వహించిన స్పందనలో రెండు అర్జీలు వచ్చాయి జెడ్‌సి బొడ్డేపల్లి రాము పాల్గొని, ఇంజనీరింగ్, రెవెన్యూ విభాగాలకు సంబంధించి చెరొక వినతి వచ్చింది.

'ఈ శ్రమ్'తో బహుళ ప్రయోజనాలు

ప్రజాశక్తి -తగరపువలస : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఈశ్రమ్ ద్వారా కార్మికులు బహుళ ప్రయోజనాలు పొందవచ్చుని భీమిలి న్యాయవాదుల సంఘం అధ్యక్షులు ఎన్ జనార్దనరావు, కార్మిక శాఖ అధికారి ప్రసాదరావు స్పష్టం చేశారు. సోమవారం స్థానిక వాస్తవ సేవా సంఘం ఆధ్వర్యంలో సంఘం అధ్యక్షులు పిట్టా సురేష్ అధ్యక్షతన చిట్టివలస లేబర్ వెల్ఫేర్ సెంటర్‌లో ఈ శ్రమ్ రిజిస్ట్రేషన్ నిర్వహించారు. 250 మంది అసంఘటిత రంగ కార్మికులు రిజిస్ట్రేషన్ చేసుకున్నారు. దుర్గాశేఖర్, ఆదిమూలం నాగరాజు సంఘం వాలంటీర్లు పాల్గొన్నారు.

పేదలకు దుప్పట్లు పంపిణీ



దుప్పట్లు పంపిణీ చేస్తున్న ఉరుకూటి తాత కుమారులు

ప్రజాశక్తి- గాజువాక: జివిఎంసి 75వ వార్డు పరిధి మొల్లివానిపాలెంలో ఉరుకూటి తాత 3వ వర్ధంతి పురస్కరించుకొని ఆయన కుమారులు సోమవారం పేదలకు దుప్పట్లు పంపిణీ చేశారు. అలాగే జెడ్‌పి హైస్కూల్ గ్రౌండ్ వెనుకనున్న ప్రాంగణంలో వాకర్స్ కూర్చోవడానికి చైర్స్‌ను అందజేశారు. కార్యక్రమంలో సిఐటియు నేతలు నమ్మి రమణ, జనసేన గాజువాక నియోజవర్గ ఇన్‌ఛార్జి కోన తాతారావు, స్టీల్‌ప్లాంట్ యూనియన్ జనరల్ సెక్రెటరీ డి.ఆదినారాయణ, అధ్యక్షులు కెఎస్ఎన్ రావు, 75వ వార్డు కార్పొరేటర్ పులి లక్ష్మీబాయి, వార్డు జనసేన పార్టీ అధ్యక్షులు కోన చినప్పారావు, స్టీల్‌ప్లాంట్ ఒబిసి అసోసియేషన్ జనరల్ సెక్రెటరీ సిహెచ్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

కార్మికుల శ్రమను దోచుకోవద్దు!

21వ రోజుకు అదానీ గంగవరం పోర్టు నిర్వాసిత కార్మికుల నిరసన దీక్షలు



మాట్లాడుతున్న అప్పలరాజు

ప్రజాశక్తి- గాజువాక : కార్మికుల శ్రమను దోచుకునే వైఖరిని అదానీ గంగవరం పోర్ట్ యాజమాన్యం మానుకోవాలని స్టీల్ జోన్ సిఐటియు నాయకులు కణితి అప్పలరాజు అన్నారు. నిర్వాసిత కార్మికుల నిరసన దీక్షలు 21వ రోజు సోమవారం కొనసాగాయి. ఈ సందర్భంగా మాట్లాడుతూ, అదానీ గంగవరం పోర్టు గతేడాది రూ.రెండు వేల కోట్ల టర్నోవర్‌తో రూ.700 కోట్ల నికర లాభాలు సాధించిందన్నారు. రాష్ట్ర ప్రభుత్వం, కార్మిక శాఖ కలుగజేసుకొని జిపిఎస్ పేరుతో ఉన్న సాఫ్ట్ అండ్ ఎస్టాబ్లిష్‌మెంట్ రిజిస్ట్రేషన్‌ను రద్దు చేయాలని కోరారు. గంగవరం పోర్టు కార్మికులకు న్యాయం జరిగే వరకూ అఖిలపక్ష పార్టీలు, కార్మిక సంఘాలు అండగా నిలుస్తాయన్నారు. యాజమాన్యం మొండివైఖరి వీడి, సంప్రదింపుల ద్వారా కార్మికుల సమస్యలు పరిష్కరించాలని కోరారు. లేకుంటే ఉధృతమైన కార్మికుల ఆందోళనకు పోర్టు యాజమాన్యం బాధ్యత వహించాల్సి ఉంటుందని హెచ్చరించారు.

గంగవరం పోర్టు కార్మికులకు రూ.22వేల బేసిక్‌తో రూ.36వేలు కనీస వేతనం చెల్లించాలని, తొలగించిన కార్మికులను బేషరతుగా విధుల్లోకి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వాన్ని నమ్మి నిర్వాసితులు తమ ఆస్తులను, సముద్రాన్ని, సర్వస్వం పోర్టుకు అప్పగిస్తే, అప్పట్లో చేసుకున్న ఒప్పందాలను తోసిపుచ్చి ప్రభుత్వ వాటాను అదానీ పోర్టు యాజమాన్యానికి కట్టబెట్టడం దుర్మార్గమన్నారు. కేంద్రంలోని బిజెపి ప్రభుత్వ ఒత్తిళ్లకు తలొగ్గి, రాష్ట్ర ప్రభుత్వం పదిశాతం వాటాలను అదానీ గంగవరం పోర్టు యాజమాన్యానికి కట్టబెట్టడం సమంజసం కాదన్నారు. కార్యక్రమంలో సిఐటియు స్టీల్ జోన్ ప్రధాన కార్యదర్శి కొవిరి అప్పలరాజు, వాసుపిల్లి ఎల్లాజీ, గంటిపల్లి అమ్మోరు, మాద అప్పారావు, పేర్ల సూకరాజు, గంటిపిల్లి లక్ష్మయ్య, కదిరి సత్యానందం, నొల్లి స్వామి, కొవిరి అమ్మోరు పాల్గొన్నారు.

అర్హులకు సంక్షేమ లబ్ధి సురక్ష లక్ష్యం

ప్రజాశక్తి -గాజువాక : అర్హులైన ప్రతి ఒక్కరికీ ప్రభుత్వ సంక్షేమ లబ్ధిని చేకూర్చడమే జగనన్న సురక్ష లక్ష్యమనిఎమ్మెల్యే తిప్పల నాగిరెడ్డి అన్నారు. సోమవారం 74వ వార్డులో జగనన్న సురక్షలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ, ప్రభుత్వ పథకాలను ప్రతి ఒక్కరికీ అందించడం, ప్రజాసమస్యలను పరిష్కరించడం, విద్యార్థులకు, అన్ని వర్గాలకు ప్రయోజనకరంగా 11రకాల సర్టిఫికెట్లను నెలరోజులుఉచితంగా అందిస్తారన్నారు. కార్పొరేటర్ వంశీరెడ్డి, జెడ్‌సి పి.సింహాచలం, ఆర్‌ఒ వరప్రసాద్, ఇఇ ప్రసాద్, డిఇఇ ఎంఆర్‌జిఅప్పారావు, ప్రత్యేకాధికారి ఎస్ వెంకటరావు, శానిటరీ ఇన్‌స్పెక్టర్ టి.నరసింగరావు, వార్డు అధ్యక్షులు ఎన్‌వై నాయుడు, రాష్ట్ర మహిళా కార్యదర్శి రోజారాణి, గొందేశి సత్యారావు, బొడ్డు గోవింద, దల్లి పైడికొండ, గోరుసు రామలక్ష్మి, ఓమ్మి ఈశ్వరి, త్రినాద్ పాల్గొన్నారు.

53వ వార్డులో ...

సీతమ్మధార : జివిఎంసి 53వ వార్డు మర్రిపాలెం అంబేద్కర్ భవనంలో జగనన్న సురక్ష శిబిరం నిర్వహించారు. కార్యక్రమంలో ఉత్తర నియోజకవర్గ సమన్వయకర్త, నెడ్‌క్యాప్ రాష్ట్ర చైర్మన్ కెకె.రాజు లబ్ధిదారులకు సర్టిఫికెట్లు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ జగనన్న సురక్ష పథకం ద్వారా ప్రతిఒక్కరికీ లబ్ధి చేకూర్చాలని ఉద్దేశంతో ప్రవేశపెట్టే పథకాన్ని ప్రజలందరూ సద్వినియోగ పరచుకోవాలని సూచించారు. కార్యక్రమంలో 53వవార్డు కార్పొరేటర్ బర్కత్ అలీ, వార్డు అధ్యక్షులు గుజ్జు వెంకటరెడ్డి, ఎపిడి పద్మావతి, ఇఇ శ్రీనివాస్, ఎఇ అర్చన, జెసిఎస్ మండల కన్వీనర్ అమర్ రెడ్డి, 53వ వార్డు నాయకులు షేక్ బాబ్జి పాల్గొన్నారు.



ధ్రువీకరణపత్రాలను అందజేస్తున్న కెకె.రాజు, బర్కత్ అలీ

దోమలు, లార్వా నివారణకు చర్యలు

ప్రజాశక్తి - ఆరిలోవ : డెంగీ, మలేరియా వ్యాధులు వ్యాప్తి చేసే దోమల నివారణ చర్యల్లో భాగంగా 13వ వార్డు పరిధిలోని నూతుల్లోను, నీటి నిల్వ ఉన్న ప్రదేశాల్లో దోమలు, వాటి లార్వాలను హరించే గంబూషియా చేప పిల్లలను విడిచిపెట్టారు. జివిఎంసి మలేరియా విభాగం ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో జోన్ మలేరియా డిపార్టుమెంట్ ఇన్‌స్పెక్టర్ మంగరాజు, వైసిపి నాయకులు కెల్ల సత్యనారాయణ, మలేరియా సిబ్బంది పాల్గొన్నారు.



బావిలో గంబూషియా చేపలను వదులుతున్న సిబ్బంది

ఏకరూప పౌరస్మృతిపై అవగాహన సదస్సు



సదస్సులో మాట్లాడుతున్న న్యాయవాది శ్రీకాంత్

ప్రజాశక్తి -ఉక్కునగరం: స్టీల్‌ప్లాంట్ ఎస్‌సి, ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో ఏకరూప పౌరస్మృతి (యూనిఫాం సివిల్ కోడ్-యుసిసి)పై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్య వక్తగా తెలంగాణ హైకోర్టు న్యాయవాది చింతల శ్రీకాంత్ మాట్లాడుతూ వివాహం, విడాకులు, వారసత్వం, దత్తత, ఇతర హక్కులు, విధులకు సంబంధించి దేశంలోని పౌరులందరికీ వర్తించే సాధారణ చట్టాల రీతిని యుసిసి సూచిస్తుందన్నారు. 1947లోనే యూనిఫాం సివిల్ కోడ్ మీద రాజ్యాంగ నిర్మాతలు చర్చించి, ప్రజలను చైతన్యపరచి యూనిఫాం సివిల్ కోడ్ వైపు ముందడుగు వేయాలని సూచించారన్నారు. అంతే తప్ప రాజ్యాంగం ద్వారా బలవంతంగా వారి అభిప్రాయాలను రుద్దాలనుకోలేదన్నారు.

ప్రస్తుత కేంద్ర ప్రభుత్వం దీన్ని అమలు చేయాలని భావిస్తున్న నేపథ్యంలో ముందుగా డ్రాఫ్ట్ బిల్లును ప్రజల ముందు పెట్టి, అన్ని ప్రాంతాలు, మతాలు, కులాల ప్రజల అభిప్రాయాలను తెలుసుకుని, చేయాలన్నారు. ఇది వెంటనే జరిగే అవకాశం లేదన్నారు. కార్యక్రమంలో కెజిహెచ్ డాక్టర్ ఆరోగ్యనాథ్, సిఐటియు స్టీల్ జోన్ అధ్యక్షుడు వైటి దాస్, ఒబిసి అసోసియేషన్ అధ్యక్షుడు అప్పారావు, ఎస్‌సి,ఎస్‌టి ఉద్యోగుల సంక్షేమ సంఘం ప్రధానకార్యదర్శి బయ్యే మల్లయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ ఎస్ సత్యనారాయణ, ఎల్‌వి రమణ, వేణు గోపాలరావు, ఫణీంద్ర బాబు, పైడి కొండలరావు, కిషోర్ సింగ్ గణేష్ పాల్గొన్నారు.

కార్మికుని కుటుంబానికి సాయం



ఆర్థిక సాయం అందిస్తున్న సిఐటియు నేతలు

ప్రజాశక్తి- ఉక్కునగరం : స్టీల్‌ప్లాంట్ ఎల్ఎంఎంఎం కేంటీన్‌లో పని చేస్తూ ఇటీవల ఆకస్మికంగా మృతి చెందిన కాంట్రాక్టు కార్మికుడు వి అప్పలనాయుడు కుటుంబానికి స్టీల్ ప్లాంట్ కేంటీన్ ఎంప్లాయిస్ యూనియన్ సభ్యులు అండగా నిలిచారు. సిఐటియు కార్మికుల వద్ద ఒకరోజు వేతనం రూ.1,12,500ను మృతుని భార్య ఆదిలక్ష్మికి సోమవారం ఉక్కునగరం సిఐటియు కార్యాలయంలో యూనియన్ నాయకులు పి శ్రీనివాసరాజు, పి నారాయణరావు, ఎ శ్రీను, జి శ్రీనివాసరావు అందజేశారు. ఈసందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి పి నారాయణరావు మాట్లాడుతూ. కష్టాల్లో ఉన్న తోటి కార్మిక కుటుంబాన్ని ఆదుకోవడానికి ముందుకు వచ్చిన కార్మికులను అభినందించారు. కార్యక్రమంలో నాయకులు. రెడ్డి రమణ, డి గణేష్, జి సత్యనారాయణ, సూర్యనారాయణ, కె దుర్యోధన, కె సురేష్, టివి రమణ, రామారావు, రాజు, కృష్ణ ప్రసాద్, నాయక్, శ్రీను పాల్గొన్నారు

వార్డు సమస్యల పరిష్కారానికి చర్యలు



గ్రామ కమిటీ సభ్యులతో చర్చిస్తున్న కార్పొరేటర్ సుధ

ప్రజాశక్తి -ములగాడ : పారిశ్రామిక ప్రాంతం 61వ వార్డులోని పలు ప్రాంతాల్లో కార్పొరేటర్ కొణతాల సుధ సోమవారం పర్యటించారు. వెంకన్నపాలెం కృష్ణుడు గుడి దగ్గర డ్రైనేజీ పూడుకుపోవడంతో శానిటరీ సిబ్బందిని క్లియర్ చేయించారు. వార్డులో ఎటువంటి సమస్య ఉన్నా నేరుగా తనకు ఫోను చేస్తే పరిష్కారానికి కృషిచేస్తానని హామీనిచ్చారు.

అభివృద్ధిపై గ్రామ కమిటీ సభ్యులతో చర్చలు

వార్డు అభివృద్ధిపై మల్కాపురం గ్రామ కమిటీ పెద్దలతో 61వ వార్డు కార్పొరేటర్ కొణతాల సుధ చర్చలు జరిపారు. మల్కాపురం మార్కెట్ మరమ్మతులు చేయాలని స్థానికులు కోరగా, నియోజకవర్గ సమన్వయకర్త ఆడారి ఆనందకుమార్ దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరుకు కృషి చేస్తానని హామీ నిచ్చారు.జెయసి బి.నాగభూషణం, కొల్లి నూకరెడ్డి, ఎన్‌వి. రమణ, సిహెచ్ నూకరాజు, బూసి అప్పలరెడ్డి, సత్యాల మహేష్, ఉరుకూటి. బాబూరావు, హరికృష్ణ, పెంటారావు, బుష్షి, గోవిందరాజు, కొండబాబు పాల్గొన్నారు.

నేడు కళా ప్రదర్శనలు



సమావేశంలో మాట్లాడుతున్న చిన్నరెడ్డి

ప్రజాశక్తి- తగరపువలస :ఉత్తరాంధ్ర శివనవచైతన్య కళా నాట్య సంక్షేమ సంఘం 19వ వార్షికోత్సవం సందర్భంగా మంగళవారం స్థానికంగా పలు కళారూపాలు ప్రదర్శించనున్నట్లు సంఘం ప్రధాన కార్యదర్శి సరగడ చిన్నరెడ్డి, కోశాధికారి బైపల్లి సూర్యనారాయణ తెలిపారు. సోమవారం స్థానిక సంఘ కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ, ఈ నెల 25న సాయంత్రం 4 గంటలకు స్థానిక జంక్షన్ నుంచి చిట్టివలస శ్రీలక్ష్మి శ్రీనివాస కల్యాణమండపం వరకు కళా ప్రదర్శనలు నిర్వహిస్తామన్నారు. జానపద నత్యాలు ప్రదర్శిస్తామన్నారు. అనంతరం సభ జరుగుతుందన్నారు, సమావేశంలో ఏపి పద్మశాలి వెల్ఫేర్ అండ్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ డైరెక్టర్ తమ్మిన రామలక్ష్మణరావు, మాజీ కౌన్సిలర్లు, జగుపిళ్ల ప్రసాద్, కోసూరు రాంబాబు పాల్గొన్నారు

విద్యార్థుల సమస్యలపై ఎస్ఎఫ్ఐ నిరాహార దీక్ష


ప్రభుత్వ జూనియర్ కళాశాల

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ జూనియర్ కళాశాల విద్యార్థుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ భారత విద్యార్థి ఫెడరేషన్ (ఎస్ఎఫ్ఐ) ఆధ్వర్యాన విద్యార్థులు సోమవారం అనకాపల్లి నాలుగు రోడ్ల జంక్షన్లో నిరాహార దీక్షలు చేపట్టారు. ఈ దీక్షలను ఎస్ఎఫ్ఐ మాజీ నాయకులు ఎ.బాలకృష్ణ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి ఎస్.రమణ మాట్లాడుతూ జూనియర్ కళాశాలలో లెక్చరర్స్ లేకపోవడం వల్ల తగిన ఫలితాలు రావడం లేదని, పాఠ్యపుస్తకాలు లేక నాణ్యమైన విద్య అందడం లేదని తెలిపారు. మధ్యాహ్న భోజన పథకాన్ని అమలు చేయకపోవడం దారుణమన్నారు. అనకాపల్లి జిల్లాలో ఎస్టీ హాస్టళ్లలో మెనూ అమలు చేయకుండా విద్యార్థుల నోరు కొడుతున్నారని విమర్శించారు. విద్యార్థులకు వస్తున్న మెస్ ఛార్జీల నుండి వర్కర్లకు జీతాలు ఇస్తున్నారని, దీని వల్ల విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందడం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. వెంటనే ఎస్టీ హాస్టల్లో పూర్తి మెనూ అమలయ్యే విధంగా, పర్మినెంట్ వర్కర్లను తీసుకునే విధంగా రాష్ట్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ జిల్లా అధ్యక్షులు మామిడి రమణ, డివిజన్ నాయకులు గొర్లి తరుణ్, నర్సీపట్నం సెక్రెటరీ జి గీతాకృష్ణ, చోడవరం సెక్రటరీ సుందర్, మహేష్, కేశవ, శ్రీను, అభి, వెంకటేష్, నాయకులు పాల్గొన్నారు.



నిరాహార దీక్ష చేస్తున్న ఎస్ఎఫ్ఐ నాయకులు, విద్యార్థులు



లాలం భాస్కరరావుకు నివాళులర్పిస్తున్న దొరస్వామి

లాలం భాస్కరరావుకు ఘన నివాళి

ప్రజాశక్తి-అచ్యుతాపురం : టిడిపి నాయకులు కీర్తిశేషులు లాలం భాస్కరరావుకు సోమవారం పలువురు ఘనంగా నివాళు లర్పించారు. భాస్కరరావు చిత్రపటానికి బ్రాండిక్స్ ఇండియా పార్టనర్ దొరస్వామి పూలమాల వేసి నివాళులర్పించారు. సోమవారం లాలం కోడూరు గ్రామంలో ఏర్పాటు చేసిన సంతాప సభ కార్యక్రమంలో దొరస్వామితో పాటు పలువురు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కుటుంబీకులను పరామర్శించారు. అచ్యుతాపురం మండలం చెందిన పలువురు నాయకులు రాజకీయాలకు అతీతంగా భాస్కరరావు సంతాప సభలో పాల్గొని నివాళులర్పించారు. ఈ ప్రాంతానికి భాస్కరరావు చేసిన సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు.

మల్టీపర్పస్ ఐడెంటిఫికేషన్ క్యాంపు నిర్వహించాలని వినతి

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లిలో వికలాంగులకు మల్టీ పర్పస్ ఐడెంటిఫికేషన్ క్యాంపు నిర్వహించాలని అనకాపల్లి పార్లమెంట్ సభ్యురాలు డాక్టర్ సత్యవతి కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. ఈ మేరకు కేంద్ర సామాజిక న్యాయ సహాయక మంత్రి నారాయణ స్వామికి లిఖిత పూర్వ వినతిపత్రం సమర్పించారు. తమ పార్లమెంట్ నియోజకవర్గంలో సుమారు 1500 నుండి 2000 మంది విభిన్న ప్రతిభావంతులు ఉన్నారని తెలిపారు. దీనిపై ఆయన సానుకూలంగా స్పందించినట్లు తెలిపారు.

చిరుజల్లులతో వరి ఆకు ముడులకు ఊపిరి

ప్రజాశక్తి అచ్యుతాపురం : తుఫాన్ ప్రభావం కారణంగా సోమవారం సాయంత్రం మండలంలో పలు గ్రామాల్లో వర్షం పడుతుంది వాతావరణం ఒకసారిగా మేఘావృతమై చిరుజల్లులు పడ్డాయి. ఈ వర్షంతో ఎండుతున్న వరి ఆకుముడలకు ప్రాణం పోసినట్లు అవుతుందని రైతన్నలు తెలుపుతున్నారు. వరి నారుమడి ఎదిగిన రైతులు నాట్లు వేయడానికి అనుకూలంగా ఉంటుందని తెలిపారు. మండలంలో తిమ్మరాజుపేట పెదపాడు ఖాజీపాలెం జగ్గన్నపేట హరిపాలెం, కొండకర్ల, చీమలపల్లి, ఎర్రవరం, ఎం జగన్నాధపురం, ఉపవారము, మల్లవరం గ్రామాలలో వరి రైతులు నాట్లు వేయటానికి సిద్ధంగా ఉన్నారు.

హైస్కూల్‌కు కంప్యూటర్ బహూకరణ

ప్రజాశక్తి- కె.కోటపాడు : మండలంలోని చౌడువాడ జిల్లా పరిషత్ హైస్కూల్‌కు అదే పాఠశాలలో చదువుకున్న పూర్వపు విద్యార్థి నరసింహరాజు ఒక కంప్యూటర్, ప్రింటర్‌ను బహూకరించారు. చౌడువాడ గ్రామానికి చెందిన నరసింహరాజు ప్రస్తుతం హైదరాబాదులో స్థిరపడ్డారు. గతంలో ఇదే హైస్కూల్లో ఉన్న విద్యార్థుల డైనింగ్ హాలుకు రెండు లక్షల రూపాయలు ఖర్చుతో ఇనుప గ్రిల్స్ ఏర్పాటు చేశారు. ప్రతి ఏటా పదవ తరగతిలో ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాలు సాధించిన విద్యార్థులకు నగదు బహుమతులు అందజేస్తున్నారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రధానోపాధ్యాయులు ఈర్ల అప్పారావు నరసింహరాజుకు కృతజ్ఞతలు తెలియజేశారు.

ప్రజలకు మరింత వేగంగా సేవలు

జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి పీడిక రాజన్న దొర



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి రాజన్నదొర

ప్రజాశక్తి-అనకాపల్లి

ప్రభుత్వ అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని జిల్లా ఇన్ఛార్జి మంత్రి పీడిక రాజన్న దొర అధికారులను ఆదేశించారు. సోమవారం ఆయన పరిశ్రమలు ఐటీ శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్, జిల్లా కలెక్టర్ రవి పట్టన్ శెట్టిలతో కలిసి కలెక్టర్ కార్యాలయంలో అనకాపల్లి నియోజకవర్గ అభివృద్ధి పనుల తీరును క్షుణ్ణంగా సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదిమందికి మంచి జరిగే పనులను వేగంగా పూర్తి చేసినట్లయితే ప్రజలకు న్యాయం చేసినట్లు అవుతుందని చెప్పారు. దీర్ఘకాలంగా అపరిష్కృతంగా ఉన్న సమస్యలను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరించాలన్నారు. సాగునీటి పారుదల, తాగునీరు, అందరికీ వైద్యం, విద్య సక్రమంగా అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. రహదారులకు మరమ్మతులు యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలన్నారు. పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అనకాపల్లి నియోజకవర్గంలోని అనకాపల్లి, కసింకోట మండలాల్లో అమలు జరుగుతున్న ప్రభుత్వ అభివృద్ధి కార్యక్రమాలను సమీక్షించారు. పరిశ్రమల శాఖ మంత్రి జి. అమరనాథ్ సంబంధిత శాఖల అధికారులతో మాట్లాడుతూ ముఖ్యమంత్రితో మాట్లాడి అవసరమైన నిధులు మంజూరు చేయిస్తానని చెప్పారు. కార్యక్రమంలో ఎంపీపీ గొర్లె సూరిబాబు, జాయింట్ కలెక్టర్ ఎం. జాహ్నవి, సిపిఓ జి.రామారావు, జోనల్ కమిషనర్ వెంకటరమణ, ఆర్ అండ్ బి ఈఈ రమేష్, డిఎంహెచ్వో డాక్టర్ హేమంత్, డిపిఓ శిరీష రాణి, హౌసింగ్ పిడి రమామణి, పిఆర్ ఈఈ వీరన్న నాయుడు, డీఈవో వెంకట లక్ష్మమ్మ, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేయాలి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి జిల్లా రేబాక గవర్నమెంట్ పాలిటెక్నిక్‌లో ఈసీఈ మూడో సంవత్సరం విద్యార్థి ఎస్.దీపిక మృతిని అనుమానాస్పద మతిగా కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టి, బాధ్యులపై కఠిన చర్యలు తీసుకోవాలని పిడిఎస్‌యు జిల్లా అధ్యక్షులు ఎన్ భాస్కర్ సోమవారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. ఈనెల 23న రాత్రి చున్నీతో ఫ్యాన్‌కి ఉరివేసుకొని మృతి చెందినట్లు కేసు నమోదు చేసినట్లు తెలుస్తుందని పేర్కొన్నారు. ఏప్రిల్ నెలలో తమ కాలేజీలో ఇద్దరు లెక్చరర్స్ స్టూడెంట్స్‌ని వేధిస్తున్నారని దీపికతో పాటు విద్యార్థులు కళాశాల ప్రిన్సిపాల్‌కు ఫిర్యాదు చేసినట్లు తెలిపారు. ఈ అంశంపై సాంకేతిక శాఖ కమిషనర్ ఫిర్యాదు వెళ్లడం, ఆర్‌జెడితో కలిపి ఐదుగురు సభ్యులు విచారణ చేసి విద్యార్థులు చెప్పింది వాస్తవమని తేలడంతో ఇద్దరు లెక్చరర్లను సస్పెండ్ చేయడం జరిగిందని పేర్కొన్నారు. సస్పెండ్ అయిన తరువాత కూడా ఆ లెక్చరర్స్ దీపికకు ఫోన్ చేసి ఫిర్యాదును వెనక్కు తీసుకోమని రకరకాల రూపాల్లో ఒత్తిళ్లు చేసినట్లు తెలుస్తుందని పేర్కొన్నారు. నాగులాపల్లికి చెందిన రిపోర్టర్ ఒకరు దీపికకు ఫోన్ చేసి కంప్లైంట్ వాపస్ తీసుకోమని కూడా ఒత్తిడి చేయడం జరిగిందని తోటి విద్యార్థులు చెబుతున్న నేపథ్యంలో దీపిక ఫోన్‌ని పరిశీలించినట్లయితే విషయాలు బయటకు రావచ్చని పేర్కొన్నారు. కేవలం ఆ విద్యార్థినికి వాళ్ల తమ్ముడికి మధ్య వాటర్ బాటిల్ దగ్గర గొడవ కారణంగానే చనిపోయిందని చెప్తున్నారని, దీనిపై సరైన విధంగా విచారణ చేసి, వాస్తవాలు బహిర్గత పరచాలని, బాధ్యులపై తక్షణమే క్రిమినల్ చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

ఘనంగా పెదబాబు జన్మదిన వేడుకలు

ప్రజాశక్తి-అనకాపల్లి : అనకాపల్లి వర్తక సంఘ అధ్యక్షులు కొణతాల లక్ష్మీనారాయణ రావు (పెదబాబు) జన్మదిన వేడుకలు స్థానిక ఏఎంఏఎల్ కళాశాలలో సోమవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ నిర్వహణలో రక్తదాన శిబిరాన్ని ప్రారంభించారు. కళాశాల విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని సుమారు 120 యూనిట్ల రక్తాన్ని దానం చేశారు. ఈ సందర్భంగా కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ గెల్లా జయబాబు మాట్లాడుతూ ప్రతి విద్యార్థి ఈ దశ నుంచే రక్తాన్ని ఇవ్వటాన్ని అలవాటు చేసుకొని మరొకరి ప్రాణాన్ని కాపాడేటట్లు చేయాలని పిలుపునిచ్చారు. కళాశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమం చేపట్టారు. ఈ కార్యక్రమంలో కళాశాల అధ్యక్షులు కొల్లూరు ఎస్ఎన్ మంగరాజు, కరెస్పాండంట్ దాడి శ్రీనివాసరావు, ఐక్యూఎసి కోఆర్డినేటర్ నిరంజన్ కుమార్, ఇండియన్ రెడ్‌క్రాస్ సొసైటీ జిల్లా శాఖ చైర్మన్ డాక్టర్ జి. రామమూర్తి, స్టేట్ కమిటీ మెంబెర్ ఎస్. వీరేన్, ట్రెజరర్ వాసు, కో ఆర్డినేటర్ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

డైట్‌లో అమెజాన్ వెబ్ సర్వీసెస్‌పై వర్కుషాపు

ప్రజాశక్తి-అనకాపల్లి : స్థానిక దాడి ఇన్స్టిట్యూట్ అఫ్ ఇంజనీరింగ్ అండ్ టెక్నాలజీలో సోమవారం ఆంధ్ర ప్రదేశ్ స్టేట్ స్కిల్ డెవలప్మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ వర్కుషాపు ప్రారంభించారు. ఈ సందర్భంగా స్కిల్ డెవలప్మెంట్ కోఆర్డినేటర్ వెంకటేశ్వరావు మాట్లాడుతూ విద్యార్థులు ఈ కార్యక్రమం ద్వారా నైపుణ్యాన్ని పెంపొందించు కోవాలని సూచించారు. కార్యక్రమంలో సిఎస్ఈ విభాగాధిపతి డాక్టర్ కె. సుజాత, ప్రిన్సిపాల్ డాక్టర్ ఆర్ వైకుంఠరావు, అసోసియేటివ్ డీన్ ఎ. కృష్ణ నాగ్, డీన్ అఫ్ అకాడెమిక్స్ డాక్టర్ కె పార్వతి, సిఎస్ఈ పాల్గొన్నారు. వర్క్ షాప్‌కి రిసోర్స్ పర్సన్స్ వెంకటేశ్వర్లరావు, వి. అనిల్, జె.లోవబాబుని కళాశాల ప్రిన్సిపాల్ శాలువా కప్పి సన్మానించారు.

రైతు సదస్సుపై ప్రచారం



ప్రచారం నిర్వహిస్తున్న రైతు సంఘం నాయకులు

ప్రజాశక్తి- కశింకోట

రైతులకు గిట్టుబాటు ధరల చట్టబద్ధత, వ్యవసాయ రంగం పరిరక్షణకై అఖిలపక్ష రైతు సంఘాలు, ఆంధ్రప్రదేశ్ రైతు సంఘాల సమన్వయ సమితి, సమ్యుక్త కిసాన్ మోర్చా (ఎస్కెఎం) ఆధ్వర్యాన ఈ నెల 25 మంగళవారం ఉదయం 10 గంటలకు మునగపాక పిఏసిఎస్ మీటింగ్ హాలులో జరిగే రైతు సదస్సును జయప్రదం చేయాలని రైతు సంఘం నాయకులు పిలుపునిచ్చారు. ఈ మేరకు సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ కసింకోట, నరసింగపల్లి, తాళ్లపాలెం తదితర గ్రామాల్లో ప్రచారం చేశారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు దాకారపు శ్రీనివాసరావు, భీముని సోమనాయుడు, పెంటకోట జగ్గారావు, తదితరులు మాట్లాడుతూ రైతాంగం అన్ని అప్పులను రద్దు చేయాలని, ఆత్మహత్యలను నివారించాలని, తుమ్మపాల, ఏటికొప్పాక, తాండవ సుగర్ ఫ్యాక్టరీలను ఆధునికీకరించి తెరిపించాలని డిమాండ్ చేశారు. భూ యజమాని ఆమోదం లేకుండానే కౌలు రైతులకు గుర్తింపు కార్డులు ఇచ్చి బ్యాంకుల ద్వారా వడ్డీ లేని రుణ సౌకర్యం కల్పించాలని కోరారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రైతులను భూమి నుండి దూరం చేసి భూములను కార్పొరేట్ కంపెనీలకు కారు చౌకగా కట్టబెట్టే కుట్ర చేస్తున్నారని విమర్శించారు. ఈ కార్యక్రమంలో కసిరెడ్డి అప్పలస్వామి నాయుడు, భీముని ఈశ్వరరావు, కసిరెడ్డి శ్రీను, పరదేశి నాయుడు, పొలగల ఆదిలక్ష్మి, మజ్జి రమణ, భీమిని చిన్న నాగమణి, పెద్ద నాగమణి, పూలగాల రమణ పాల్గొన్నారు.

మునగపాక రూరల్ : మునగపాక పిఏసిఎస్ ఫంక్షన్ హాల్ లో జరుగు జిల్లా రైతు సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ సోమవారం మండలంలో ప్రచార జాత నిర్వహించారు. ఈ సందర్భంగా రైతు సంఘం నాయకులు ఎస్ బ్రహ్మాజీ, దాకారపు శ్రీనివాసరావు మాట్లాడుతూ గిట్టుబాటు ధరల చట్టబద్ధత వ్యవసాయ రంగ పరిరక్షణ సమస్యల పరిష్కారం కోసం జరిగే జిల్లా రైతు సదస్సుకు రైతులు పెద్ద ఎత్తున తరలిరావాలని కోరారు. ఈ కార్యక్రమంలో దొడ్డి శ్రీను, శిలపరశెట్టి అప్పారావు, కాండ్రేగుల జగ్గ అప్పారావు రైతులు పాల్గొన్నారు.

30న విజయవాడ రైతు సదస్సు పోస్టర్ ఆవిష్కరణ

అనకాపల్లి : అన్ని పంటలకు కనీస మద్దతు ధరలు ప్రకటించి వాటి అమలు కోసం చట్టం చేయాలని కోరుతూ ఈనెల 30న విజయవాడలో జరుగు అఖిల పక్ష రైతు సదస్సును విజయవంతం చేయాలని రైతు సంఘాల నాయకులు పిలుపునిచ్చారు. స్థానిక దొడ్డి రాము నాయుడు కార్మిక కర్షక నిలయంలో రైతు సదస్సు పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా నాయకులు పీఎస్ అజయ్ కుమార్, ఏ బాలకృష్ణ, బాలు గాడి, కోరిబిల్లి శంకర్రావు, నరాల శెట్టి సత్యనారాయణ, సిఐటియు నాయకులు వివి శ్రీనివాసరావు, కౌలు రైతు సంఘం నాయకులు కాళ్ల తేలయ్య బాబు మాట్లాడుతూ కేంద్రంలో నరేంద్ర మోడీ ప్రభుత్వం రైతులకు ఇచ్చిన ఏ ఒక్క వాగ్దానం అమలు చేయలేదన్నారు. ఆ కారణంగానే పంటలకు గిట్టుబాటు ధరలు రాలేదని, బ్యాంకుల్లో రుణ సౌకర్యం అందటం లేదని ఆవేదన వ్యక్తం చేశారు. మరోవైపు ఎరువులు విత్తనాలు పురుగు మందు ధరలు సబ్సిడీలు రద్దు చేయడం వలన వాటి ధరలు దారుణంగా పెరిగిపోయాయని వాపోయారు. విద్యుత్ సంస్కరణ బిల్లు 2020 రద్దు చేసి వ్యవసాయ రంగానికి ఉచిత విద్యుత్ కొనసాగించాలని, స్మార్ట్ మీటర్లు బిగించవద్దని కోరారు.

మౌలిక సదుపాయాల కల్పనకు చర్యలు

ప్రజాశక్తి-అనకాపల్లి : గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పనకు సంబంధిత అధికారులు తక్షణం చర్యలు తీసుకోవాలని రాష్ట్ర పరిశ్రమల శాఖ మంత్రి గుడివాడ అమర్నాథ్ ఆదేశించారు. అనకాపల్లి మండలం కొండుపాలెం, చేనుల అగ్రహారం గ్రామాలలో ఎంపిపి గొర్లె సూరిబాబు ఆధ్వర్యంలో సోమవారం జరిగిన గడపగడపకు కార్యక్రమంలో మంత్రి అమర్నాథ్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన గడపగడపకు వెళ్లి లబ్ధిదారులకు ప్రభుత్వం మంజూరు చేసిన పథకాలను సంబంధించిన బ్రోచర్లను అందజేశారు. ఈ గ్రామాలలో స్థానికులు మంత్రిని కలిసి వ్యక్తిగత సమస్యలు తెలియజేసుకున్నారు. ఇళ్ల స్థలాలు, రేషన్ కార్డులు, పింఛన్లు కొన్ని సాంకేతిక కారణాలవల్ల అందలేదని ఒకరిద్దరు మంత్రి అమర్నాథ్ దృష్టికి తీసుకురాగా వెంటనే సంబంధిత సిబ్బందిని పిలిచి వీలైనంత త్వరగా ఈ సమస్యలను పరిష్కరించాలని ఆదేశించారు. కొండుపాలెంలో రూ.15 లక్షలతో నిర్మించిన అంతర్గత సిమెంట్ రోడ్లను, రూ.10 లక్షలతో నిర్మించిన కాలువలను, రూ.13.8 లక్షలతో అభివృద్ధి చేసిన మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలను, రూ.10.30 లక్షలతో నిర్మించిన 20 కిలో లీటర్ల ఓవర్ హెడ్ ట్యాంకును మంత్రి ప్రారంభించారు. కార్యక్రమంలో ఎంపిపి గొర్లె సూరిబాబు, మండల వైసిపి అధ్యక్షులు పెద్దిశెట్టి గోవింద, కోడూరు, ఊడేరు, గ్రామాల సర్పంచులు సేనాపతి శ్రీనివాసరావు, సిరిగిరి శెట్టి కష్ణమోహన్, వైసిపి మహిళ నాయకురాలు పద్మ, గృహ సారథులు, సచివాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

ఎన్టీఆర్ విగ్రహం కూల్చివేత

ప్రజాశక్తి- అనకాపల్లి : జివిఎంసి 82వ వార్డు విజయరామరాజుపేట జంక్షన్‌లో కీర్తిశేషులు నందమూరి తారక రామారావు భారీ విగ్రహం కూల్చివేతకు గురైంది. గుర్తు తెలియని లారీ అర్ధరాత్రి సమయంలో ఢీకొట్టడంతో విగ్రహం కింద పడి రెండు భాగాలుగా పగిలిపోయింది. విషయం తెలుసుకున్న స్థానిక టిడిపి నాయకులు లారీ సమాచార విషయాన్ని సేకరిస్తున్నారు. టిడిపి అనకాపల్లి జిల్లా అధ్యక్షులు బుద్ద నాగ జగదీశ్వరరావు, మాజీ ఎమ్మెల్యే పీలా గోవింద సత్యనారాయణ వేరువేరుగా సంఘటనా స్థలానికి చేరుకొని విగ్రహాన్ని పరిశీలించారు. ఎన్టీఆర్ విగ్రహాన్ని పునరుద్ధరించడానికి కృషి చేస్తామన్నారు. విగ్రహ ధ్వంసానికి కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు మళ్ల సురేంద్ర, సప్పవరపు గణేష్, కర్రి బాబి, దాడి జగన్, పిట్ల రాజు, పోలవరపు త్రినాధరావు, ఆళ్ల రామచంద్రరావు, అండిబోయిన శేషు, బోడి వెంకటరావు, మళ్ల శివన్నారాయణ, ఎల్లంకి సత్తిబాబు, భాను చంద్ర అఖిల్, పల్లా సత్య అప్పారావు, బర్నికాన శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

మాజీ కౌన్సిలర్ గంగయ్యమ్మ మృతి

ప్రజాశక్తి -అనకాపల్లి : అనకాపల్లి పురపాలక సంఘం మాజీ కౌన్సిలర్ బుద్ద గంగయమ్మ ఆదివారం రాత్రి మృతి చెందారు. ఆమె 13వ వార్డు కౌన్సిలర్‌గా 2000- 2005 సమయంలో పనిచేశారు. ఆమె వయస్సు 86 సంవత్సరాలు. కొణతాల జగన్నాధ రావు నాయుడు అనకాపల్లి మున్సిపల్ చైర్మన్‌గా పనిచేస్తున్న కాలంలో కౌన్సిలర్‌గా బాధ్యతలు చేపట్టి అనేక సమస్యలు పరిష్కరించారు. ఆమె మృతికి పలువురు మాజీ కౌన్సిలర్లు సంతాపం తెలియపరిచారు. అంత్యక్రియలు నిదానం దొడ్డి వారి స్వగృహంలో సోమవారం ఆమె కుటుంబీకులు నిర్వహించారు.

మొక్కలు నాటివేత

ప్రజాశక్తి బుచ్చయ్యపేట : బుచ్చయ్యపేట మండల కేంద్రంలో సోమవారం ప్రభుత్వ విప్, ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ గ్రీన్ మిలీనియం కార్యక్రమంలో భాగంగా మొక్కలు నాటారు. సందర్భంగా ఆయన మాట్లాడుతూ మొక్కలు నాటడం ద్వారాగా పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని సూచించారు. కార్యక్రమంలో జడ్పిటిసి దొండ రాంబాబు, మండల పార్టీ అధ్యక్షులు కొల్లిమల్ల అచ్చమనాయుడు, వై.బాలరాజు, సీసీలు కొండయ్య, రాజు, గణేష్, వెంకట్రావు, వియ్యపు ముత్యాల నాయుడు తదితరులు పాల్గొన్నారు.



మొక్కలు నాటుతున్న ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ

కౌలు రైతుల గుర్తింపునకు గడువు పెంచాలని వినతి



కలెక్టర్‌కు సమస్యను వివరిస్తున్న బాలకృష్ణ

ప్రజాశక్తి- అనకాపల్లి

కౌలు రైతుల గుర్తింపునకు గడువు పెంచాలని రైతు స్వరాజ్య వేదిక, ఆంధ్రప్రదేశ్ కౌలు రైతుల సంఘం సంయుక్తంగా సోమవారం కలెక్టరేట్ స్పందనలో కలెక్టర్ రవి పఠాన్‌శెట్టికి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయా సంఘాల నాయకులు బాలు గాడి, ఎ.బాలకృష్ణ మాట్లాడుతూ గతంలో ఇచ్చిన కౌలు గుర్తింపు కార్డులపై రెన్యువల్ చేసినా చేయకపోయినప్పటికీ విత్తనాలు, ఎరువులు ఇవ్వాలని కోరారు. జిల్లాలో 30 వేల పైచిలుకు కౌలు రైతులు ఉన్నప్పటికీ ఈ ఏడాది కౌలు కార్డులు గుర్తింపుకు రాష్ట్ర ప్రభుత్వం 4 వేల లోపే టార్గెట్ ఇవ్వడం అన్యాయమని తెలిపారు. గ్రామాలలో వాలంటీర్లు సచివాలయ సిబ్బంది సహకారంతో ఇంటింటికి వెళ్లి కౌలు రైతుల నమోదుకు పూనుకొని కౌలు రైతులను గుర్తించాలని కోరారు. ఈ సందర్భంగా కలెక్టర్ జిల్లా వ్యవసాయ శాఖ అధికారిని గుర్తింపును ముమ్మరం చేయాలని ఆదేశించిచ్చారు. ఈ నేపథ్యంలో గ్రామాలలో కౌలురైతులందరు కౌలు కార్డుల నమోదు కొరకు స్థానిక సచివాలయాల్లో కానీ, రైతు భరోసా కేంద్రాల్లో కానీ సంప్రదించి కార్డులు పొందాలని బాలు గాడి, బాలకృష్ణ పిలుపునిచ్చారు.

వినియోగదారుల చట్టంపై అవగాహన కల్పించాలని...

వినియోగదారుల హక్కులు, భద్రత, వస్తు నాణ్యతా ప్రమాణాలు, వినియోగదారుల రక్షణ చట్టంపై ప్రభుత్వ ఆదేశాల మేరకు తక్షణం అవగాహన సదస్సులు నిర్వహించాలని రాష్ట్ర వినియోగదారుల సంఘాల సమాఖ్య అధ్యక్షుడు కాంగ్రేగుల వెంకటరమణ సోమవారం జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల జారీ చేసిన వినియోగదారుల సంఘాల నిర్వహకుల నియమావళిని కచ్చితంగా అమలు చేయాలని కాంగ్రేగుల వెంకటరమణ కోరారు. ఆయన వెంట కన్సూమర్ రైట్స్ సేఫ్‌గార్డింగ్ సొసైటీ అధ్యక్షుడు రెడ్డి సత్యనారాయణ, వినియోగదారుల సంక్షేమ సంఘం కార్యదర్శి టి.వి.రమణ (చోడవరం), మునగపాక వినియోగదారుల సంఘం సహాయ కార్యదర్శి బి.జగ్గఅప్పారావు (మునగపాక) ఉన్నారు.

జల వనరులుశాఖ డివిజన్ కార్యాలయం ఏర్పాటు చేయాలని..

జల వనరులుశాఖ డివిజన్ కార్యాలయం అనకాపల్లి జిల్లా కేంద్రంలో ఏర్పాటు చేయాలని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం నాయకులు కలెక్టర్ రవి పటాన్ శెట్టికి వినతిపత్రం అందజేశారు. సంఘం నాయకులు భీశెట్టి కృష్ణప్పారావు, కాంగ్రేగుల విశ్వేశ్వరరావు పాల్గొన్నారు.

స్పందనకు వినతుల వెల్లువ

అనకాపల్లి : జిల్లా కలెక్టరేట్‌లో సోమవారం నిర్వహించిన స్పందన కార్యక్రమానికి వినతులు వెల్లువెత్తాయి. పలు సమస్యలపై ప్రజలు 305 ఫిర్యాదులు సమర్పించారు. వీటిని ప్రజల నుంచి కలెక్టర్ రవి పట్టన్ శెట్టి, జాయింట్ కలెక్టర్ జాహ్నవి, జిల్లా రెవెన్యూ అధికారి వెంకట రమణ, సచివాలయం నోడల్ అధికారి మంజుల వాణి, డీఆర్‌డీఏ ప్రాజెక్ట్ డైరెక్టర్ లక్ష్మీపతి స్వీకరించారు.

ఎస్పీ కార్యాలయంలో 37

సమస్యలను చట్టపరిధిలో సత్వరమే పరిష్కరించవలసిందిగా సంబంధిత పోలీసు అధికారులను ఎస్పి మురళీకృష్ణ ఆదేశించారు. సోమవారం ఎస్పీ కార్యాలయంలో జరిగిన స్పందనలో నేరుగా ఫిర్యాదుదారుల నుంచి అర్జీలను స్వీకరించారు. ఈ కార్యక్రమంలో 37 ఫిర్యాదులు వచ్చాయి. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ (పరిపాలన) బి.విజయభాస్కర్, ఎస్.బి ఇన్‌స్పెక్టర్ చంద్రశేఖర్, ఎస్సై చక్రధర్ పాల్గొన్నారు.

పంచాయితీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలి

ప్రజాశక్తి-అచ్యుతాపురం

పంచాయితీ కార్మికులకు కనీస వేతనం చెల్లించాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు ఆర్ శంకర్రావు డిమాండ్ చేశారు. అచ్యుతాపురంలో సోమవారం పంచాయితీ కార్మికులతో సిఐటియు ఆధ్వర్యంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శంకర్రావు మాట్లాడుతూ ప్రజల ఆరోగ్యం కోసం గ్రామ పారిశుధ్య కార్మికులు తమ ఆరోగ్యం ఫణంగా పెట్టి పని చేస్తున్నారని తెలిపారు. వారికి కనీస వేతనాలు చెల్లించకపోవడం అన్యాయమన్నారు. చాలీచాలని జీతాలతో పంచాయితీ కార్మికులు జీవనం సాగిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. పంచాయితీ కార్మికుల శ్రమను ప్రభుత్వం దోపిడీ చేస్తుందన్నారు. మున్సిపాలిటీల్లో ఇచ్చే విధంగా వేతనాలు పంచాయితీ కార్మికులకు ఇవ్వాలని డిమాండ్ చేశారు. పనిముట్లు, గుర్తింపు కార్డులు, గ్లౌజులు, సబ్బులు, నూనెలు ఇవ్వాలని, కోరారు. సెలవులు మంజూరు చేసి ఈఎస్ఐ, పిఎఫ్ వంటి సౌకర్యం కల్పించాలన్నారు. బకాయి పడ్డ వేతనాలు ఇచ్చి కార్మికులను పర్మినెంట్ చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు ఆర్.రాము, పంచాయితీ కార్మికులు కొండమ్మ, నూకరాజు, తదితరులు పాల్గొన్నారు.

రాహుల్ గాంధీ పర్యటనను విజయవంతం చేయాలి

పిసిసి అధ్యక్షులు రుద్రరాజు



మాట్లాడుతున్న పిసిసి అధ్యక్షులు రుద్రరాజు

ప్రజాశక్తి -అనకాపల్లి : కాంగ్రెస్ పార్టీ అగ్రనేత రాహుల్ గాంధీ ఆగస్టులో విశాఖ పర్యటన కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కాంగ్రెస్ పార్టీ కార్యకర్తలకు పిసిసి అధ్యక్షులు గిడుగు రుద్రరాజు పిలుపునిచ్చారు. సోమవారం అనకాపల్లి న్యూ కాలనీలోని రోటరీ క్లబ్ హాలులో అనకాపల్లి జిల్లా కోఆర్డినేషన్ కమిటీ సభ్యులు, ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విశాఖ ఉక్కు ఆంధ్రుల హక్కు అనే నినాదంతో ప్రజలు పోరాడి సాధించుకున్న విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌ను నేటి బిజెపి ప్రభుత్వం నష్టాల పేరుతో ప్రైవేటీకరణ చేయడానికి ప్రయత్నిస్తుందని విమర్శించారు. సుమారు 900 రోజులుగా స్టీల్ ప్లాంట్ ఉద్యోగులు, కార్మికులు, కార్షకులు నిర్వాసితులు పెద్ద ఎత్తున ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా పోరాటం చేస్తూ ఉంటే ఆంధ్రప్రదేశ్ లో ఉన్న వైసిపి ప్రభుత్వం గానీ, ప్రధాన ప్రతిపక్షమైన టిడిపి గానీ, బిజెపికి తోక పార్టీగా ఉన్న జనసేన గాని కార్మికుల యొక్క పోరాటాన్ని పట్టించుకోకుండా ప్రధాని మోడీకి భజన చేస్తున్నారని రుద్రరాజు విమర్శించారు. వచ్చే నెలలో రాహుల్ గాంధీ విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రైవేటీకరణ వ్యతిరేకంగా ఉక్కు ఉద్యోగులు, కార్మికులు చేస్తున్న దీక్షా శిబిరాన్ని సందర్శిస్తారని తెలిపారు. కార్యక్రమంలో రాష్ట్ర కాంగ్రెస్ పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ పి.రాకేష్ రెడ్డి, రాష్ట్ర యువజన కాంగ్రెస్ అధ్యక్షులు రుత్తల శ్రీరామమూర్తి, జిల్లా నాయకులు రుత్తల రామారావు, బొడ్డు శ్రీనివాసరావు, వేగి వెంకటేష్, గొంప గోవింద్, ఐ.ఆర్.గంగాధర్, దాసరి సంతోష్ పాల్గొన్నారు.



పాఠశాల యాజమాన్యంతో ప్రతిభ కనబర్చిన విద్యార్థులు

కరాటేలో సెయింట్ జాన్స్ విద్యార్థుల ప్రతిభ

ప్రజాశక్తి -కశింకోట : తెలంగాణలో ఇటీవల జరిగిన 11వ జాతీయ స్థాయి కరాటే పోటీల్లో కశింకోట సెయింట్ జాన్స్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ కనబరిచారు. మొదట స్థానంలో షణ్ముఖ, తాత్విక, బాలాజీ, ఎమ్ ఫాషంకి, సాల్వెక్ , గిరీష్, ద్వితీయ శ్రేణిలో భవిష్ కుమార్, జోసెఫ్, చరణ్, నవదీప్, చరిత గెలుపొందారు. వీరిని పాఠశాలలో సోమవారం అభినందించారు ఈ కార్యక్రమంలో కరస్పాండెంట్ బత్తుల అనురాధ , ప్రిన్సిపాల్ రూపనంద, కరాటే కోచ్ సి.హెచ్.సూరి అప్పారావు, విద్యార్థులు పాల్గొన్నారు.

ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలు నమోదు

ప్రజాశక్తి-గొలుగొండ:మండలంలో ప్రత్యేక అవసరాల గల పిల్లల వివరాలను ప్రశస్త యాప్‌లో నమోదు చేస్తున్నట్లు ఏఎల్‌పురం ప్రత్యేక ఉపాధ్యాయులు తమ్మిల మాణిక్యం తెలిపారు. సోమవారం ఏఎల్‌పురం, చోద్యం పాఠశాలలో యాప్‌పై అవగాహన కల్పించి ఉపాధ్యాయులతో డౌన్‌లోడ్ చేయించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఆంధ్రప్రదేశ్ సమగ్ర శిక్ష ఆధ్వర్యంలో నేషనల్ కౌన్సిల్ ఆఫ్ ఎడ్యుకేషన్ రీసర్చ్ అండ్ ట్రైనింగ్ (ఎన్‌సిఈఆర్‌టి) రూపొందించిన ఈ యాప్‌ను ఉపాధ్యాయులంతా డౌన్‌లోడ్ చేసుకొని ఆయా పాఠశాలల్లో ఉన్న ప్రత్యేక అవసరాల పిల్లల వివరాలను నమోదు చేస్తున్నారన్నారు. ఇప్పటికే 140 మందికి పైగా ఉపాధ్యాయులు యాప్‌ను డౌన్‌లోడ్ చేసుకున్నారని, 140 మంది దివ్యాంగ పిల్లలను గుర్తించామని చెప్పారు. చోద్యం పాఠశాలలో యాప్‌పై అవగాహన కల్పించారు.

ఎస్సీ, ఎస్టీలకు ఉచిత విద్యుత్‌పై వేటు

ప్రజాశక్తి-అనకాపల్లి : దళిత గిరిజన కుటుంబాలకి ఇచ్చే ఉచిత విద్యుత్తుకు వైసిపి ప్రభుత్వం ఎసరు పెట్టిందని, 1.41 లక్షల ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు షాక్ ఇస్తుందని తెలుగుదేశం పార్టీ అనకాపల్లి పార్లమెంట్ నియోజకవర్గ మీడియా కోఆర్డినేటర్ కొణతాల వెంకటరావు విమర్శించారు. స్థానిక పార్టీ కార్యాలయంలో సోమవారం విలేకరుల సమావేశంలో వైసిపి ప్రభుత్వంపై విరుచుకుపడ్డారు. 2019 ఎన్నికలకు ముందు నెలకు 200 యూనిట్లు లోపు విద్యుత్ వినియోగించే ఎస్సీ ఎస్టీ కుటుంబాలకు ఉచిత విద్యుత్ ఇస్తామన్న జగన్ రెడ్డి ప్రభుత్వం ఉచిత విద్యుత్ వినియోగదారుల సంఖ్యను తగ్గించేందుకు నిబంధనలను విధించారన్నారు. రానున్న ఎన్నికల్లో ఎస్సీ ఎస్టీలు జగన్ రెడ్డి ప్రభుత్వానికి తగిన రీతిలో బుద్ధి చెబుతారని వెంకటరావు వ్యాఖ్యానించారు. విలేకరుల సమావేశంలో కాయల ప్రసన్నలక్ష్మి, సిమ్మిటి రామకష్ణ, బోరుకు గంగరాజు, సాలాపు నాయుడు తదితరులు పాల్గొన్నారు.

పారదర్శకంగా ఓటర్ సర్వే

ప్రజాశక్తి- కె.కోటపాడు : ఓటర్ జాబితా సర్వేలో ఎటువంటి అవకతవకలు లేకుండా జాగ్రత్తలు తీసుకొని పారదర్శకంగా చేపట్టాలని స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ ఎలక్ట్రోల్ అధికారి డి.అనిత బిఎల్ఓలకు సూచించారు. సోమవారం కింతాడ పంచాయతీలో జరుగుతున్న ఓటర్ సర్వేలో పాల్గొని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి ఇంటికి బిఎల్ఓలు వెళ్లాలని ఓటర్ల లిస్టులో ఉన్న పేర్లు సక్రమంగా ఉన్నాయా లేవా , ఇంటి నెంబరు, పోలింగ్ బూత్ నెంబర్లు అన్ని పరిశీలించాలని సూచించారు. ఒకే ఇంటి నెంబర్లో ఎక్కువ ఓట్లు ఉన్నట్లయితే వాటిపై మండల స్థాయి అధికారులకు వెంటనే తెలియజేయాలన్నారు. ప్రతి ఇంటిలో అన్ని పేర్లు సక్రమంగా ఉన్నట్లు నిర్ధారించుకొని సర్వే పూర్తయినట్లు ఆ ఇంటికి స్టిక్కర్ అంటించాలని సూచించారు. ఆమె వెంట డిప్యూటీ తహశీల్దార్ రమేష్, మండల ఎన్నికల అధికారి త్రిమూర్తులు, బిఎల్ఓ అనంత్ ఉన్నారు.



ఓటర్ల సర్వేను పరిశీలిస్తున్న స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ అనిత

రాష్ట్రస్థాయి యోగా పోటీలకు
శ్రీ ప్రకాష్ విద్యార్థులు

ప్రజాశక్తి-పాయకరావుపేట:నేషనల్ యోగా ఫెడరేషన్ ఆఫ్ ఇండియా (కాకినాడ జె.ఎన్.టి.యు) ఈనెల 23న నిర్వహించిన అండర్ 14 యోగా పోటీల్లో స్థానిక శ్రీ ప్రకాష్ విద్యార్థులు ప్రతిభను చాటి రాష్ట్రస్థాయి యోగా పోటీలకు అర్హత సాధించారని విద్యా సంస్థల సీనియర్ ప్రిన్సిపల్ ఎం.వి.వి.ఎస్ మూర్తి తెలిపారు. విద్యార్థులు జి.సోమ సూర్య చరణ్, జి.హర్షవర్ధిని ప్రతిభను చాటారన్నారు. ప్రతిభ కనబరిచిన విద్యార్థులను విద్యాసంస్థల అధినేత సిహెచ్. వి. కే నరసింహారావు, విద్యా సంస్థల సంయుక్త కార్యదర్శి సిహెచ్. విజయ్ ప్రకాష్, ప్రధానోపాధ్యాయులు అపర్ణ, నీలాదేవి, యోగా గురువు సురేష్, విద్యార్థులు ఉపాధ్యాయులు అభినందించారు.





ఎంపికైన సభ్యులు

జనసేన కార్యవర్గం ఏర్పాటు

ప్రజాశక్తి-మాడుగుల:జన సేన గ్రామ కమిటీ ఏర్పాటు అయ్యింది. ఒమ్మలి గ్రామ శాఖ అధ్యక్షులు గా అశోక్, ఉపాధ్యక్షులుగా ఉండూరు మహేష్, టి రామకృష్ణ, కార్యదర్శిగా తాటి కొండ సత్తిబాబు, కోశాధికారిగా పెంట రెడ్డి గణేష్, కార్య వర్గ సభ్యులుగా జొన్న పల్లి గణేష్, పాతాళ శ్రీను, గొర్లి సన్యాసిరావు, ఖాతా గణేశ్వరి తదితరులు ఎన్నిక అయ్యారు. ఈ కార్యక్రమంలో మండల నేతలు దాసరి అచ్యుతరావు, జిల్లా రూరల్ కమిటీ సభ్యులు అప్పలనాయుడు, పాము గట్టి శివాజీ, గుమ్మాల నాగరాజు, ఉండూరు కుమార్, ఎం.అజిత్, దండి రమణ తదితరులు పాల్గొన్నారు.

4 నుంచి యోగా పోటీలు

ప్రజాశక్తి -నక్కపల్లి :ఆగస్టు 4 నుంచి 6వ తేదీ వరకూ బీకేఎస్ అయ్యంగార్ మెమోరియల్ నేషనల్ లెవల్ ఓపెన్ యోగా ఛాంపియన్షిప్ పోటీలు జరుగుతాయని ఏపీ స్టేట్ యోగా అసోసియేషన్ కార్యనిర్వాహక అధ్యక్షులు పుల్లేటి సతీశ్ తెలిపారు. స్థానిక విలేకర్లతో సోమవారం ఆయన మాట్లాడుతూ, ఆన్ లైన్‌లో నిర్వహించే ఈ పోటీలకు అన్ని ఏర్పాట్లు పూర్తి చేశామని, గెలుపొందిన వారికి ప్రశంసాపత్రాలు, మెడల్స్ బహూకరిస్తామన్నారు. 8 సంవత్సరాల నుంచి 20 సంవత్సరాల వయస్సున్న బాల, బాలికలు, 20 సంవత్సరాల నుంచి 60 సంవత్సరాల వయస్సున్న వారంతా ఈ పోటీల్లో పాల్గొనవచ్చునన్నారు. ఈ సమావేశంలో ఆయుష్ యోగా టీచర్ రాంబాబు పాల్గొన్నారు.

మాజీ సర్పంచ్ విగ్రహావిష్కరణ

ప్రజాశక్తి-రావికమతం:మండలంలో గుమ్మాల పాడు గ్రామ మాజీ సర్పంచ్ కాలింగి శివయ్య నాయుడు విగ్రహాన్ని చోడవరం మాజీ శాసనసభ్యులు కేఎస్ఎన్ఎస్ రాజు సోమవారం ఆవిష్కరించారు. గ్రామంలో ఆంజనేయ స్వామి కోవెల ఎదురుగా కుటుంబ సభ్యులు విగ్రహాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా రాజు మాట్లాడుతూ, సర్పంచ్‌గా పని చేసిన కాలంలో గ్రామాన్ని అభివృద్ధి పథంలో నడిపిస్తూ గ్రామ ప్రజలందరికీ మంచి సేవలు అదించి మన్ననలు పొందారన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి చోడవరం ఇంచార్జ్ లిబత్తుల తాతయ్య బాబు, మాడుగుల తెలుగుదేశం పార్టీ నాయకులు పైల ప్రసాద్‌రావు, రావికమతం మండల పార్టీ అధ్యక్షుడు రాజానా కొండ నాయుడు, సర్పంచులు గంజి మోది నాయుడు, శివ, అర్జున, పాత్రుడు పాల్గొన్నారు.

ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే బాబూరావు

ప్రజాశక్తి -నక్కపల్లి:ప్రజా సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని గొల్ల బాబురావు అన్నారు. మండలం లోని సోమవారం రాజయ్యపేట, బంగారమ్మపేట గ్రామాల్లో జగనన్న సురక్ష కార్యక్రమం నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి, సంక్షేమ ఫలాలను ప్రజలు ముంగిటికే అందిస్తున్నట్లు తెలిపారు.అర్హులై ఉండి సంక్షేమ పథకాలు అందని వారిని గుర్తించి ఉచితంగా పలు ధ్రువీకరణ పత్రాలు అందజేయడం ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం అన్నారు. లబ్ధిదారులకు ధవీకరణ పత్రాలు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎంపీడీవో శ్రీనివాసరావు, తహసీల్దార్ అంబేద్కర్, ఈఓపిఆర్డీ వెంకట నారాయణ, ఏవో సీతారామరాజు, డిటి నీరజ వివిధ శాఖల అధికారులు, సర్పంచ్ అప్పల నరస, ఎంపీపీ రత్నం, జడ్పిటిసి సభ్యురాలు కాసులమ్మ,
వైసిపి పార్టీ మండల శాఖ అధ్యక్షులు శీరం నరసింహ మూర్తి, ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.
ఎస్.రాయవరం:మండలంలో ఒమ్మవరం, పెద గుమ్ములూరు గ్రామాల్లో నిర్వహించిన జగనన్న సురక్షలో ఎమ్మెల్యే బాబూరావు మాట్లాడుతూ, సంక్షేమ పథకాలు అందని వారికి అందేలా చేయడమే ఈ కార్యక్రమం ముఖ్యోద్దేశమన్నారు. ఈ కార్యక్రమం లో సుమారు 11 రకాల సేవలకు సంబందించిన పత్రాలను ప్రజలకు అందిస్తున్నా మన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ విజయ్ కుమార్, ఎంపిడివో రామచంద్రమూర్తి, ఈవోఆర్డీ సత్యనారాయణ, జెడ్పిటిసి కాకర దేవి, ఎంపిపి కోన లోవలక్ష్మి, కొణతాల శ్రీనివాస్, పెదగుమ్ములూరు ఎంపిటిసి వెంకటలక్ష్మి , పార్టీ సీనియర్ నాయకులు పోలిశెట్టి పెద ఈశ్వరరావు, శ్రీపతి రాజు, మాజీ జడ్పీటీసీ నీలేంద్రరావు, సచివాలయం కన్వీనర్ వెలగా శ్రీనివాసరావు, చింతలపాటి మణిరాజు, యేజర్ల సీతారామరాజు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే బాబూరావు

కొత్తకోటలో కంటి వైద్యశిబిరం

ప్రజాశక్తి -కొత్తకోట:రావికమతం మండలం కొత్తకోట గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరం విజయవంతమైంది. స్థానిక స్టేట్ బ్యాంక్ సమీపంలో కేదారశెట్టి రామారావు కొత్త ఇంటి ఆవరణలో వాసవీ క్లబ్ న్యూ ఆధ్వర్యంలో శంకర్ ఫౌండేషన్ సహకారంతో వైఎస్ ఆర్ కంటి వెలుగు కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి 100 మంది కంటి రోగులు తరలివచ్చారు. ఆప్తాలమిక్ అసిస్టెంట్ హరిచందన వైద్య పరీక్షలు చేయగా వీరిలో 42 మందికి కంటి ఆపరేషన్ అవసరమని గుర్తించారు. వీరిని విశాఖ శంకర్ ఫౌండేషన్ కంటి ఆసుపత్రికి తరలించిన్నట్లు ఏరియా కో ఆర్డినేటర్ అరుణ్ కుమార్ తెలిపారు. శిబిరానికి వచ్చిన రోగులకు వాసవి క్లబ్ న్యూ సభ్యులు అల్పా హారం ఏర్పాటు చేసారు. ఈ కంటి వైద్య శిబిరాన్ని వాసవీ క్లబ్ న్యూ సభ్యులు రమేష్, నరేంద్ర, అశోక్,కె.రామారావు ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ న్యూ సభ్యులు పాల్గొన్నారు.



కంటి వైద్య పరీక్షలు చేస్తున్న వైద్యులు

పట్టాల మంజూరుకు ర్యాలీ



ర్యాలీ చేస్తున్న నాయకులు

ప్రజాశక్తి -నర్సీపట్నంటౌన్:అటవీ బంజర పోడు భూములకు పట్టాల మంజూరు చేయాలని ఆంధ్రప్రదేశ్ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో శ్రీ కన్య కూడలి నుండి ఆర్డీవో కార్యాలయం వరకు ర్యాలీ నిర్వహించారు. అనంతరం రెవిన్యూ డివిజనల్ అధికారి వారికి వినతిపత్రం అందజేశారు.ఈ సందర్భంగా వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్ష కార్యదర్శిలు మాకిరెడ్డి రామునాయుడు, శివలంక కొండలరావు మాట్లాడుతూ, నర్సీపట్నం నియోజకవర్గం నాలుగు మండలాల్లో సుమారు 40 నుండి 70 సంవత్సరాల ఏళ్ల నుండి అటవీ బంజర పోడు భూములను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలకు చెందిన రైతులు సాగు చేసుకుంటూ కుటుంబాలతో జీవనం సాగిస్తున్నారన్నారు. గిరిజన హక్కు చట్టం ప్రకారం పట్టాలు ఇవ్వాలన్నారు. ఉపాధి పని దినములు 200 రోజులు పెంచాలని, రోజువారి ఉపాధి కూలీ 600 రూపాయలు ఇవ్వాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఐ జిల్లా కార్యవర్గ సభ్యులు జి.గురుబాబు, వి.అర్జున్‌రావు, ఏఐవైఎఫ్ రాష్ట్ర సమితి సభ్యులు జి రాధాకృష్ణ, రైతు సంఘం జిల్లా అధ్యక్షులు గొల్లి మాణిక్యం, సిపిఐ మండల కార్యదర్శి మేకా భాస్కరరావు పాల్గొన్నారు.

పార్టీలకతీతంగా పథకాలు

ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్: వేములపూడి గ్రామంలో సోమవారం నిర్వహించిన గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే ఉమాశంకర్ గణేష్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ, సంక్షేమ పథకాలతో సమాజంలో ఆర్థిక అసమానతలు తొలగించి, తద్వారా పేదరిక నిర్మూలన కోసం ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి కృషి చేస్తున్నారని కొనియాడారు. పార్టీలు చూడకుండా, రాజకీయాలకు అతీతంగా అర్హత ఉన్న ప్రతి పేదవాడికి పథకాలు చేరుతున్నాయని తెలిపారు. లంచాలు ఇవ్వాల్సిన అవసరం లేకుండా సంక్షేమ పథకాలు అందజేస్తున్నామని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీటీసీ బోలేం వెంకటేష్, గుడివాడ లోవరాజు, ఎంపీపీ సుర్ల రాజేశ్వరి, నర్సీపట్నం మండల పార్టీ ప్రెసిడెంట్ సుర్ల సత్యనారాయణ, సర్పంచ్ లు శెట్టి శ్రీను, వెంకటరత్నం, కన్నయ్య నాయుడు, బంటు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.



సమస్యలు తెలుసుకుంటున్న ఎమ్మెల్యే

పట్టా భూములను ఆన్‌లైన్ చేయాలి
సిపిఎం ఆందోళన

ప్రజాశక్తి-మాడుగుల:పంపిణీ చేసిన డి ఫారం ప ట్టాలకు అనేక సంవత్సరాలుగా ఆన్‌లైన్ చేయక పోవడంతో సోమవారం సిపిఎం అధ్వర్యంలో రెవెన్యూ కార్యాలయం వద్ద పెద్ద ఎత్తున ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు డి.వెంకన్న, కార్యవర్గ సభ్యులు కే.గోవిందరావు, ఇ.నరసింహమూర్తి, భవాని మాట్లాడుతూ, పది సంవత్సరాల క్రితం మాడుగుల మండలం విజే పురం, ఒమ్మలి, రావి కమతం మండలం కోమిరి గ్రామాలకు చెందిన 500 మందికి ఉర్లోవ కొండ ప్రాంతంలో పట్టాలు మంజూరు చేయడంతో వీరు అప్పటి నుండి, సాగు చేసుకుంటున్నారని తెలిపారు. ఇప్పటి వరకు సదరు భూములను ఆన్ లైన్ చేయ లేదని, దీంతో అనేక సంవత్సరాలుగా రైతులు రెవెన్యూ కార్యాలయం చుట్టూ కాళ్లరిగేలా తిరుగుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తహసీల్దార్ కార్యాలయంలో వినతి పత్రం సమర్పించారు.



ఆందోళన చేస్తున్న నేతలు

గిరిజనుల సమస్యలపై వినతి

ప్రజాశక్తి-కోటవురట్ల: గిరిజన గ్రామమైన అణుకు ప్రాంతానికి రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని సోమవారం సిపిఎం ఆధ్వర్యంలో గిరిజనులు స్పందనలో కలెక్టర్‌కు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా సిపిఎం నేతలు, గిరిజనులు మాట్లాడుతూ, రహదారి, పాఠశాల సౌకర్యం కల్పించాలని 18 రోజులుగా రిలే నిరాహార దీక్ష చేస్తున్నామని తెలిపారు. ప్రధానంగా పాఠశాల విద్యార్థులు ఆరు కిలోమీటర్లు నడిచి చదువుకు నేందుకు వెళ్లేందుకు ఇబ్బంది పడుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం స్పందించి తగు చర్యలు చేపట్టాలని కోరారు. ఈ కార్యక్రమంలో డేవిడ్‌రాజు, సూరిబాబు, రఘుబాబు, రాజబాబు పాల్గొన్నారు.
అణుకు గ్రామానికి రహదారి, పాఠశాల కల్పించాలని చేపడుతున్న రిలే నిరాహార దీక్షలు సోమవారం నాటికి 18వ రోజుకు చేరుకున్నాయి. పాఠశాల, రోడ్డు మంజూరు చేయాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో గ్రామానికి చెందిన పలువురు గిరిజనులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న అప్పలరాజు

నర్సీపట్నంలో షాపుల తొలగింపు

ప్రజాశక్తి -నర్సీపట్నం టౌన్ :పట్టణంలో రోడ్డు విస్తరణలో భాగంగా బ్రిటిష్ అధికారుల సమాధులకు అనుకుని ఏర్పాటు చేసిన షాపుల తొలగింపు చర్యలు చేపట్టారు. ఈ సమాధుల వద్ద చిన్నపాటి ఉద్యానవనం ఏర్పాటు చేయాలని కొందరు స్థానికులు న్యాయస్థానాన్ని ఆశ్రయించినప్పటికీ ఎటువంటి ప్రయోజనం లేకపోయింది. అటువంటిది రోడ్డు విస్తరణ ప్రక్రియ రెండో దశలో భాగంగా మెయిన్ రోడ్డులో ఉన్న హైవర్డ్ , కవర్ట్ సమాధుల స్థలంలో నిర్మించిన షాపులను సోమవారం కూల్చివేశారు. సుమారు 54 అక్రమ నిర్మాణాలను ఇప్పటికే గుర్తించారు.



తొలగిస్తున్న షాపులు

ఉపాధ్యాయుడు సస్పెన్షన్

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని అమలాపురం ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయుడు టి.అప్పలనాయుడును సస్పెన్షన్ చేసినట్లు ఎంఈఓ నరేష్ సోమవారం వెల్లడించారు. విద్యాశాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ శనివారం పాఠశాల తనిఖీ చేసినప్పుడు విద్యార్థుల వర్క్ బుక్ లో తప్పును ఒప్పుగా రైట్ కొట్టినందుకుగాను ఉపాధ్యాయుడు అప్పలనాయుడును సస్పెండ్ చేయాలని డీఈఓ వెంకట లక్ష్మమ్మకు ప్రిన్సిపల్ సెక్రటరీ ప్రవీణ్ ప్రకాష్ ఆదేశాలు జారీ చేయడం జరిగిందన్నారు. ఆయన ఆదేశాల మేరకు ఉపాధ్యాయుడును డీఈవో సస్పెన్షన్ చేసినట్లు ఎంఈఓ వెల్లడించారు.

మణిపూర్ ఘటనలపై నిరసనలు

ప్రజాశక్తి-నర్సీపట్నం టౌన్:మణిపూర్‌లో మహిళ లపై జరిగిన అఘాయిత్యాన్ని ఖండిస్తూ అఖిల భారత ప్రజాతంత్ర మహిళా సంఘం (ఐద్వా), అఖిల భారత విద్యార్థి సంఘం(ఎస్ఎఫ్ ఐ) ఆధ్వర్యంలో సోమవారం వేములపూడి జిల్లా పరిషత్ పాఠశాలలో విద్యార్థులతో కలిసి నిరసన చేపట్టారు. ఐద్వా నర్సీపట్నం డివిజన్ కార్యదర్శి ప్రసన్న రాజేశ్వరి మాట్లాడుతూ, సభ్య సమాజం సిగ్గుపడేలా మణుపూర్‌లో మహిళలను వివస్త్రలను చేసి ఊరేగించడాన్ని ఐద్వా తీవ్రంగా ఖండిస్తుందన్నారు. ఈ సంఘటనకు కారకులైన వారిని కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎస్ఎఫ్ఐ డివిజన్ నాయకుడు ఎం. ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు,

కలెక్టరేట్ : మణిపూర్ మహిళలకు రక్షణ కల్పించి తక్షణమే శాంతి నెలకొనేలా కేంద్ర ప్రభుత్వం చర్యలు తీసుకోవాలని కోరుతూ మహిళా సమాఖ్య, ఎఐవైఎఫ్, ఎఐఎస్ఎఫ్ ఆధ్వర్యాన మహిళా కాలేజీ నుంచి ఎల్ఐసి బిల్డింగ్ మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అత్తిలి విమల, కె.అచ్యుతరావు, యు.నాగరాజు తదితరులు పాల్గొన్నారు.

మణిపూర్ దాడులకు కారణమైన వారందరినీ అరెస్ట్ చేయాలని ఇంటర్నేషనల్ దళిత జర్నలిస్టుల నెట్వర్క్ (ఐడిఐఎన్) ప్రధాన కార్యదర్శి పి.సురేంద్రబాబు, ఉపాధ్యక్షుడు పి. సత్యనారాయణ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం కలెక్టరేట్ ఆవరణలో నిరసన తెలిపారు. స్పందనలో కలెక్టర్‌కు వినతిపత్రం అందజేశారు.

అచ్యుతాపురం: మణిపూర్‌లో మహిళలపై జరుగుతున్న హింస, అకృత్యాలను ఆపాలని, అత్యాచార నిందితులను కఠినంగా శిక్షించాలని కోరుతూ సీఐటీయు ఆధ్వర్యంలో సోమవారం అచ్యుతాపురం హైస్కూల్ వద్ద కొవ్వొత్తులతో నిరసన ప్రదర్శన చేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ జిల్లా కార్యదర్శి సిహెచ్.రూపదేవి మాట్లాడుతూ, సుప్రీంకోర్టు జోక్యం చేసుకునే వరకూ ప్రధాని నరేంద్ర మోడీ స్పందించలేదన్నారు. ఐద్వా జిల్లా అధ్యక్షులు పి. మాణిక్యం, ఆర్. లక్ష్మి, సిఐటియు నాయకులు వి వి శ్రీనివాసరావు, ఆర్. రాము, చొప్పా రమణ పాల్గొన్నారు.

చోడవరం : మణిపూర్‌లో జరిగిన హమానవీయ సంఘటన నేపథ్యంలో బిరెన్ సింగ్ ప్రభుత్వాన్ని రద్దు చేయాలని రాష్ట్ర దళిత విముక్తి సంఘం ఆధ్వర్యంలో సోమవారం చోడవరం పట్టణ ద్వారకా నగర్‌లో ఆందోళన నిర్వహించారు. నాయకులు సుర్ల వెంకటరమణ, ఎస్ సంజీవ్, ఎస్.కె. హుస్సేన్, డి బోడయ్య, వి.సతీష్, పేరమ్మ, ఈశ్వరమ్మ, అప్పయ్యమ్మ, జ్యోతి, తదితరులు పాల్గొన్నారు.

వీఆర్‌కు పోలీసులు

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:నాతవరం పోలీస్టేషన్‌లో శనివారం రాత్రి కలగాని గంగరాజు అలియాస్ నాని అనే యువకుడిని పోలీసులు కొట్టిన ఘటనపై ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణించారు. ఎస్ఐ, ముగ్గురు కానిస్టేబుళ్లు, ఒక హెూంగార్డును వీఆర్‌కు బదిలీ చేసినట్టు నర్సీపట్నం ఏఎస్పీ ఆదిరాజ్‌సింగ్ రాణా తెలిపారు. ఆయన నర్సీపట్నం రూరల్ సీఐ రమణయ్యతో కలిసి నాతవరం పోలీస్టేషన్‌ను సందర్శించారు. యువకుడిని పోలీసులు కొట్టిన సంఘటనపై ప్రాథమిక విచారణ నిర్వహించారు. అనంతరం ఆయన మీడియాతో మాట్లాడుతూ, గంగరాజు ఆరోగ్యం బాగానే ఉందని తెలిపారు. మహిళ పట్ల అసభ్యకరంగా ప్రవర్తించాడన్న ఫిర్యాదు మేరకు గంగరాజుపై వివిధ సెక్షన్ల కింద స్థానిక పోలీసులు కేసు నమోదు చేశారని చెప్పారు. విధి నిర్వహణలో అలసత్వం వహించారన్న అభియోగాలపై ఎస్ఐ లక్ష్మీనారాయణ, కానిస్టేబుళ్లు నవీన్, కుమార్, మల్లేశ్, హెూంగార్డు వరహాలును వీఆర్‌కు బదిలీ చేశామని తెలిపారు. గొలుగొండ ఎస్ఐ నారాయణరావుకు నాతవరం ఎస్ఐగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్టు ఏఎస్పీ చెప్పారు.

'బహుజనులకు అన్యాయం'

ప్రజాశక్తి-నర్సీపట్నంటౌన్:స్థానిక ఆర్‌సిఎం స్కూల్ ఆవరణలో వివిధ దళిత సంఘాల ప్రతినిధులతో కూడిన విదసం ఐక్యవేదిక సమావేశం నిర్వహిం చారు. ఈ సమావేశానికి ఐక్యవేదిక వ్యస్థాపకులు, ఏపి రాష్ట్ర కౌన్సిల్ కన్వీనర్ డాక్టర్ బూసి వెంకట్రావు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా వెంకట్రావు విధసం ప్రణాళికను ఉద్దేశాలను వివరించారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీలు ఒక్క తాటిపైకే రావాల్సిన సందర్భం వచ్చిందని తెలిపారు. బహుజనుల ఓట్లతో గెలిచిన ప్రభుత్వాలు అన్యాయం చేస్తున్నాయన్నారు. సంక్షేమ పథకాలను తీసివేసి అన్యాయం చేస్తున్నాయన్నారు. సైకాలజిస్ట్ డాక్టర్ రాజు మాట్లాడుతూ, బహుజనులపై దాడులు చేస్తూ భయానకమైన పరిస్థితులను సృష్టించి అన్యాయంగా హత్యలు చేస్తున్నా ప్రభుత్వాలు పట్టించుకోలేదని ఆయన అన్నారు. దళితులందర్నీ ఒకే తాటిపైకి తీసుకొచ్చి హక్కుల కోసం పోరాటం చేద్దామని సంఘాల నాయకులు నిర్ణయం తీసుకున్నారు. అనంతరం డివిజన్ స్థాయి నూతన పాలకవర్గం ఎన్నుకున్నారు. ఈ సమావేశంలో ప్రముఖ నాయకులు, ఉద్యోగులు పాల్గొన్నారు.


ప్రమాణం చేస్తున్న నేతలు


వినతిపత్రాన్ని చూపుతున్న మత్స్యకారులు

జెట్టి ఏర్పాటు చేయాలి

ప్రజాశక్తి -నక్కపల్లి:మండలంలోని రాజయ్యపేట పంచాయతీ శివారు బోయపాడు సముద్రతీరంలో జెట్టి ఏర్పాటు చేయాలని మత్స్యకారులు కోరారు. అదేవిధంగా ఈ ప్రాంతంలో మత్స్యకారుల జీవన విధానాన్ని దృష్టిలో పెట్టుకొని ఫిష్ ల్యాండింగ్ సెంటర్ నిర్మాణం చేపట్టాలన్నారు. సోమవారం అనకాపల్లి జిల్లా కలెక్టర్ కార్యాలయంలో స్పందనలో జెట్టి, ఫిష్ లాండింగ్ సెంటర్ నిర్మాణంపై వినతిపత్రం అందజేసినట్లు మత్స్యకారులు స్థానిక విలేకరులకు తెలియజేశారు. బోయపాడు సముద్రతీరంలో జెట్టి ఏర్పాటు చేసేందుకు గాను పలుసార్లు అధికారులు స్థల పరిశీలన చేసినట్లు తెలిపారు. ఎమ్మెల్యే బాబురావు బోయపాడులో జెట్టి ఏర్పాటుకు పూర్తి సహకారం అందిస్తామని హామీ ఇవ్వడం జరిగిందన్నారు.ఈ కార్యక్రమంలో ఏపీ మత్స్యకార జెఏసి రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసిపిల్లి నూకరాజు, రాజయ్య పేట వైస్ ప్రెసిడెంట్ పిక్కి కొండలరావు, వార్డ్ మెంబర్ పిక్కి అప్పలరాజు, మత్స్యకార నాయకులు సిరిపిల్లి అప్పలరాజు, వాసిపిల్లి రాజు, వాసిపిల్లి యేసు, బొంది గోవిందు, పిక్కి చినతాత తదితరులు పాల్గొన్నారు .

చెత్త సేకరణ ఛార్జీలు రద్దుచేయాలి


వినతిపత్రం ఇస్తున్న వార్వా,నివాస్ ప్రతినిధులు

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : చెత్త సేకరణ ఛార్జీలను రద్దుచెయ్యాలని, వాటి చెల్లింపులకు ప్రజల మీద, సచివాలయ సిబ్బంది, శానిటరీ చిరు ఉద్యోగులపై ఒత్తిడులు, బెదిరింపులకు పాల్పడరాదని, ఈ సమస్యపై కౌన్సిల్లో చర్చించి పరిష్కరించాలని కోరుతూ వార్వా, నివాస్ ప్రతినిధులు సోమవారం మేయర్ గొలగాని హరి వెంకటకుమారికి వినతిపత్రం అందించారు. చెత్త సేకరణ ఛార్జీలను తగ్గించి, 5 కేటగిరీలుగా మార్చి గత ఏడాది ఆగస్టులో జివిఎంసి కౌన్సిల్లో తీసుకున్న నిర్ణయాన్ని కమిషనర్ ఉల్లంఘించి, స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి చెత్త సేకరణ ఛార్జీలు వసూళ్లు జరపాలని సచివాలయ, శానిటరీ కార్యదర్శులపై ఒత్తిడి తెస్తున్నారని తెలిపారు. నిర్దేశించిన లక్ష్యాలు దాటి వసూలు చెయ్యకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని బెదిరిస్తున్నారని వినతిలో పేర్కొన్నారు. కన్సర్వెన్సీ పన్ను రూపంలో చెత్త సేకరణ ఛార్జీలు ఆస్తిపన్నులో భాగంగా ఉన్నందున అదనంగా చెత్త సేకరణకు వసూలు చెయ్యరాదని, వాటిని రద్దుచెయ్యాలని వార్వా నివాస్ సంఘాలు వేసిన కేసుపై హైకోర్టులో విచారణ సాగుతోందని, కేసు నడుస్తుండగా చెత్తపై యూజర్ ఛార్జీల కోసం ఏకపక్షంగా ఒత్తిడి చెయ్యడం న్యాయ విరుద్ధమని పేర్కొన్నారు. నగరంలోని అన్ని ప్రాంతాలను సుందరంగా తీర్చి దిద్ది స్వచ్ఛ సర్వేక్షణ్‌లో ఆలిండియా ర్యాంక్ సాధించాలని కోరారు. దీనిపై మేయర్ స్పందిస్తూ చెత్త సేకరణ ఛార్జీలను 5 భాగాలుగా తగ్గించిన కౌన్సిల్ నిర్ణయాన్ని రాష్ట్ర ప్రభుత్వానికి పంపించామని, వారి జవాబు కోసం ఎదురు చూస్తున్నామని తెలిపారు. ఈ సమస్యను కౌన్సిల్లో లేవనెత్తి, తగిన పరిష్కారం కోసం పట్టుపట్టాలని కోరుతూ నగర డిప్యూటీ మేయర్ జి శ్రీధర్‌కు, వైసిపి టిడిపి, జనసేన, సిపిఎం, సిపిఐ, బిజెపి ఫ్లోర్ లీడర్లు బాణాల శ్రీనివాసరావు, పీలా శ్రీనివాసరావు, వసంత లక్ష్మి, డాక్టర్ బి.గంగారావు, ఎజె.స్టాలిన్, జి.కవితలకు వినతిపత్రాలు సమర్పించారు. ఈ కార్యక్రమంలో వార్వా అధ్యక్షుడు ఎన్.ప్రకాశరావు, ప్రధాన కార్యదర్శి బిబి.గణేష్, నివాస్ ప్రధాన కార్యదర్శి పిట్టా నారాయణమూర్తి, కోశాధికారి ఆర్.గణేష్‌కుమార్, కెఎం.కుమారమంగళం, టి.కామేశ్వరరావు పాల్గొన్నారు.

ఆక్రమణలపై చర్యకు వినతి

ప్రజాశక్తి -ఎంవిపి కాలనీ : గ్రీన్ బెల్ట్ ప్రాంతమైన ఓపెన్ స్పేస్ (పార్క్) రెయిన్ వాటర్ క్యారీయింగ్ కెనాల్ ఆక్రమణపై గోపాలపట్నం నరవకు చెందిన గోదావరి ఎన్‌క్లేవ్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ సభ్యులు సోమవారం జివిఎంసి కార్యాలయంలో నిర్వహించిన జగనన్నకు చెబుదాంలో కమిషనర్‌కు, అనంతరం పెందుర్తి తహశీల్దార్లకు వినతిపత్రాలు అందించారు. ఈ గ్రీన్‌బెల్ట్, ఖాళీ స్థలాలు (దేవాలయ ఉద్యానవన ప్రాంతం), వర్షపు నీరు వెళ్లే కాలువ క్రమంగా ఆక్రమణకు గురవుతున్నాయని వివరించారు. ఇటీవల స్థానిక నివాసితులలో ఒకరు ఈ ఆక్రమిత స్థలాలపై అక్రమంగా ఫెన్సింగ్‌ను నిర్మించారని పేర్కొన్నారు. సమీపంలోని కొండల నుంచి వస్తున్న నీరు ఆక్రమణకు గురైన నీటి కాలువ ద్వారా గ్రామం మధ్యలో ఉన్న చెరువుకు చేరుతుందని తెలిపారు. ఈ కాలువను అడ్డుకోవడం వల్ల నీటి వనరులకు కోలుకోలేని నష్టం వాటిల్లుతోందని, భవిష్యత్తులో ఇళ్లలోకి కూడా నీరు పొంగిపొర్లే అవకాశముందని వివరించారు. అధికారులు స్పందించి చర్యలు తీసుకుని ఆక్రమణకు గురైన స్థలాలను తిరిగి గోదావరి లే-అవుట్ అసోసియేషన్‌కు అప్పగించాలని, అక్రమార్కులను చట్ట ప్రకారం శిక్షించాలని కోరారు. అక్రమార్కులు రోజురోజుకూ ఆక్రమణలను క్రమంగా పెంచుతున్నందున సకాలంలో చర్యలు తీసుకోవాలని అభ్యర్థించారు. ఈ కార్యక్రమంలో గోదావరి ఎన్‌క్లేవ్ లే-అవుట్ ఫ్లాట్ ఓనర్స్ అసోసియేషన్ అధ్యక్షులు ఎంఎల్‌సి.కుమార్, కార్యదర్శి గోపీనాథ్‌రెడ్డి, కోశాధికారి డివి.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

గ్రంథాలయ పితామహునికి ఘన నివాళి

ప్రజాశక్తి- నక్కపల్లి:మండలంలోని చినదొడ్డిగల్లు శాఖ గ్రంథాలయంలో సోమవారం గ్రంథాలయ అధికారి జనార్దన్ ఆధ్వర్యంలో గ్రంథాలయ పితామహుడు అయ్యంకి వెంకట రమణ 133వ జయంతిని ఘనంగా నిర్వహించారు. ముందుగా అయ్యంకి వెంకట రమణ చిత్ర పటానికి పూల మాల వేసి జ్యోతి ప్రజ్వలన చేశారు.ఈ సంధర్భంగా గ్రంథాలయ అధికారి జనార్దన్ మాట్లాడుతూ, గ్రంథాలయాల అభివృద్ధికి అయ్యంకి ఎనలేని కృషి చేశారన్నారు.1934 నుండి 1948 సంవత్సర మధ్యకాలంలో కోస్తాంధ్రలో అనేక గ్రంథాలయాలను ఆయన స్థాపించారని అన్నారు. ఈ కార్యక్రమంలో గ్రంథాలయ అభివృద్ధి కమిటీ చైర్మన్ అప్పలరాజు, సిబ్బంది రమణమ్మ, పాఠకులు పాల్గున్నారు.

గొలుగొండ:స్థానిక గ్రంథాలయంలో ఆ శాఖాధికారి రాజుబాబు ఆధ్వర్యంలో అయ్యంకి వెంకట రమణయ్య జయంతి నిర్వహించారు. ఈ కార్యక్రమానికి హాజరైన సీఆర్పీ రామకృష్ణ, కేజీబీవీ పాఠశాల ఒకేషనల్ ఉపాధ్యాయురాలు రవణమ్మలు మాట్లాడుతూ, ఇటువంటి ఉద్యమ నాయకులను ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో కేజీబీవీ పాఠశాల నుండి 11 మంది పాల్గొన్నారు.


అయ్యంకి చిత్రపటానికి పూలమాల వేస్తున్న గ్రంథాలయాధికారి

ఓటర్ల జాబితాపై సర్వే

ప్రజాశక్తి -కోటవురట్ల:ఓటర్ల జాబితా పై ఇంటింటి సర్వేలో భాగంగా సోమవారం మండల కేంద్రంలో బూత్ లెవెల్ అధికారులు గ్రామంలో సర్వే నిర్వహించారు. ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్ జాబితా పరిశీలించడంతో పాటు ఆ ప్రాంత ఇరు పార్టీల బూత్ కమిటీ సభ్యులతో ఓటర్ గుర్తింపు కార్డు, ఫోటో, చిరునామాలు పరిశీలించారు.ఫిర్యాదులు, అభ్యంతరాలు నమోదు చేసుకుంటున్నారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవెల్ అధికారి అప్పారావు, బూత్ కమిటీ సభ్యులు జానికి శివ, పాల్గొన్నారు .

28న కోటవురట్ల మండల సమావేశం

ప్రజాశక్తి-కోటవురట్ల:మండల సర్వసభ్య ఈనెల 28 శుక్రవారం సమావేశం నిర్వహించనున్నట్లు ఎంపీడీవో కాశీ విశ్వనాథరావు తెలిపారు. ఈ మేరకు ఎంపీటీసీ సభ్యులకు, మండల గ్రామస్థాయి అధికారులకు సమాచారం అందజేశామన్నారు.


చేపడుతున్న పారిశుధ్య పనులు

ఎస్‌సి కాలనీలో పారిశుధ్య పనులు

ప్రజాశక్తి -కొత్తకోట:' సమస్యల నడుమ ఎస్‌సి కాలనీ' పేరుతో ప్రజాశక్తిలో వచ్చిన వార్తకు కొత్తకోట పంచాయతీ అధికారులు ఎట్టకేలకు స్పందించారు. స్థానిక ఎస్‌సి కాలనిలో తాగునీరు, పారి శుధ్యం నిర్వహణ సమస్యల పై ఈ నెల 21న ప్రజాశక్తిలో కథనం వచ్చింది. దీంతో పంచాయితీ ఇవో కృష్ణ మోహన్ స్పందించారు. ఎస్‌సి కాలనీలో పర్యటించి తాగు నీరు సరఫరాపై చర్యలు చేపట్టారు. గత రెండు రోజుల నుంచి పారి శుధ్య నిర్వహణపై ప్రత్యేక శ్రద్ధ చూపించి పనులు చేయిస్తున్నారు. సుమారు నాలుగు వార్డులలో నెల కొన్న తాగు నీటి సమస్యను పరిష్కరించాలని సంకల్పిం చారు. మండల తాగు నీటి సరఫరా విభాగం అధికారులతో పాటు ఎంపిడిఓ వెంకన్న బాబు కు సమస్య తీవ్రతపై వివరించారు. సహకారం అందించాలని ఈవో కృష్ణ మోహన్ కోరారు.

టిటిడి నిధులు మంజూరు

ప్రజాశక్తి-రోలుగుంట:మండలంలో 16 గ్రామాల్లో దేవాలయాల నిర్మాణానికి టిటిడి బోర్డు నుండి కోటి 70లక్షలు మంజూరైనట్లు ఎంపిపి యర్రంశెట్టి శ్రీనివాసరావు తెలిపారు. 16 గ్రామాలకు ఒక్కొక్క దేవాలయంనకు రూ.10లక్షలు ఎమ్మెల్యే ధర్మశ్రీ కృషి ఫలితంగా టిటిడి చైర్మన్ వైవి.సుబ్బారెడ్డి మంజూరు చేశారన్నారు.


నగదు ఇస్తున్న నేతలు

రూ45 వేల ఆర్థిక సహాయం

ప్రజాశక్తి -చీడికాడ:మండలంలోని చుక్కపల్లి గ్రామంలో ఇటీవల గుండెపోటుతో మరణించిన క్రియాశీలక జన సైనికుడి కుటుంబానికి మాడుగుల నియోజవర్గం జనసైనికులు రూ.45 వేలను అందజేశారు. ఈ సందర్భంగా జన సైనికులు మాట్లాడుతూ, క్రియాశీలక సభ్యత్వం తీసుకుని సహజ మరణం పొందితే భీమా నగదు తో పాటు, నియోజవర్గంలో ఉన్న జనసైనికులు కుటుంబానికి అండగా ఉంటారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో మజ్జి కృష్ణ, ముర్రు ఈశ్వర్, రాయపరెడ్డి కృష్ణ, జివి మూర్తి, గట్టా రామారావు, గుమ్మడి సంతోష్, కుంచె అంజిబాబు సుంకర అప్పారావు పాల్గొన్నారు.